




మంగళవారం ఉష్ణోగ్రత

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	36	23
భద్రాద్రి కొత్తగూడెం	37	25

సమర సన్నాహాలు



సమీపిస్తున్న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ముహూర్తం తరుముకొస్తుండడంతో రాజకీయ పార్టీలు ముందస్తు ప్రచారాలకు సన్నాహాలు చేసుకుంటున్నాయి. సభలు, సమావేశాలతో ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యచరణ సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఆయా పార్టీల నేతలు వ్యూహ ప్రతివ్యూహాల్లో నిమగ్నమయ్యారు. ఈ ఎన్నికలను అన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండటంతో అభ్యర్థులకు పరీక్ష కాబోతున్నాయి. గెలుపే లక్ష్యంగా అగ్రనేతలు ప్రచారాల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుండగా, ఎక్కడికక్కడ పార్టీల శ్రేణులు ఏర్పాట్లు పూర్తి చేస్తు న్నాయి. అభ్యర్థులు, పార్టీల ఓటుబ్యాంకు, జాతీయ సమీకరణాల ఆధారంగా ఓటింగ్ ఉంటుందని భావిస్తుండటంతో లోక్‌సభ ఎన్నికలపై ఆసక్తి పెరుగుతోంది.

- ఎన్నికల ప్రచార రణంలోకి ప్రధాన పార్టీలు
- రేపు ఖమ్మంలో బీఆర్‌ఎస్ సభ.. పాల్గొననున్న హరీశ్‌రావు
- 11న భద్రాచలానికి సీఎం రేవంత్ రెడ్డి.. బూర్గంపహాడ్‌లో బహిరంగసభ
- అభ్యర్థుల వేటలో బీజేపీ.. ఇతర పార్టీల కీలక నేతలపై కన్ను...
- పొత్తులో భాగంగా ఖమ్మం టికెట్ కోరుతున్న సీపీఐ
- ఒంటరిగానే బరిలోకి సీపీఎం

ఖమ్మం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో.. ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడుతూ ఎన్నికల ప్రచారసభల్లో పాల్గొననున్నారు. శ్రీరామనవమి కల్యాణానికి ఎన్నికల కోడ్ అడ్డు వచ్చే అవకాశం ఉన్నందున షెడ్యూల్ ప్రకటనకు ముందే సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 11న భద్రాచలం పుణ్యక్షేత్రం వస్తున్నారు. సీతారామచంద్రస్వామి ఆలయం దర్శనం, ప్రత్యేక పూజలతో పాటు ఐటీడీఏలో సీతారామ ప్రాజెక్టు పనులపైనా, గిరిజన అభివృద్ధి పనులపైనా సమీక్ష నిర్వహించబోతున్నారు. అదే విధంగా భద్రాచలం అభివృద్ధికి ఉన్న సరిహద్దు సమస్యలు, ఐదు పంచాయతీల సమస్యలన్నింటిపైనా కూలంకషంగా సీఎం చర్చించబోతున్నారు. ఆలయ అభివృద్ధికి నిధులు వెల్లడించే అవకాశం ఉంది.



అదేరోజు బూర్గంపాడు మండలం లక్ష్మీపురం సమీపంలో భారీ ఎన్నికల ప్రచారసభ ఏర్పాటుతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదో గ్యారంటీగా స్థలం ఉండి ఇల్లులేని లబ్దిదారులకు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల మంజూరు పథకానికి కూడా శ్రీకారం చుట్టబోతున్నారు. అదే రోజు జరిగే బహిరంగ సభలో మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి పేరును ప్రకటించే అవకాశం ఉంది. పోటీ తీవ్రంగా ఉండడంతో ఖమ్మం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటనలో జాప్యం జరిగే అకాశం ఉంది.

7న బీఆర్‌ఎస్ సభ

బీఆర్‌ఎస్ నుంచి ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా ప్రస్తుతం సిటింగ్ ఎంపీ, బీఆర్‌ఎస్ లోక్‌సభపక్ష నేత నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి సిటింగ్ ఎంపీ మాలోతు కవిత పేర్లు పార్టీ అధినేత కేసీఆర్ అధికారికంగా ప్రకటించారు. దీంతో నాగేశ్వరరావు ఖమ్మం లోక్‌సభ ఎన్నికల ప్రచార ఘట్టాన్ని ప్రారంభించబోతున్నారు. ఈనెల 7న ఖమ్మం వీవీసీ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచార సభ జరగబోతుంది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలోని మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లతోపాటు సంస్థాగతంగా పార్టీ పదవుల్లో ఉన్న నేతలు హాజరుకాబోతున్నారు. మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు ఈ ప్రచార సభకు హాజరవుతున్నారు. అదేరోజు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు అభినందన సభ కూడా జరగబోతుంది. ఈ సభ ద్వారా భారీ జనసమీకరణ జరిపి బీఆర్‌ఎస్‌కు కొంత లాభం చేకూర్చేందుకు నాయకులు సన్నద్ధమయ్యారు.

బీజేపీ సన్నాహాలు

భారతీయ జనతాపార్టీ కూడా ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. బీఆర్‌ఎస్ తదితర పార్టీల నుంచి దీటైన అభ్యర్థులపై కన్నేసి, ముఖ్యనేతలు ఎవరైనా వస్తే ఖమ్మం, మహబూబాబాద్ టికెట్లు కేటాయించేందుకు ఆలోచిస్తోంది. ఇప్పటికే స్థానికంగా బీఆర్‌ఎస్ నుంచి జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు శ్రీధర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు తదితరుల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అయితే అధిష్ఠానం ఖమ్మం టికెట్ ఎవరికన్నది తేల్చడం లేదు. బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి ఎవరైనా పెద్ద నేతలు వస్తే వారిని పార్టీలోకి తీసుకోవాలని బీజేపీ భావిస్తోంది.

సీపీఐ గురి

ఖమ్మం లోక్‌సభ ఎన్నికలపై సీపీఐ కూడా గురిపెట్టింది. ఇటీవల ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించి జాతీయస్థాయి ఇండియా కూటమి పొత్తులో ఖమ్మం టికెట్ అడగాలని నిర్ణయించారు. దీంతో జాతీయస్థాయిలో కాంగ్రెస్, సీపీఐ పొత్తులో ఖమ్మం టికెట్ సీపీఐకి కేటాయించాలని కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేస్తున్నది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్,సీపీఐ పొత్తులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.నారాయణ ఖమ్మం నుంచి బరిలో నిలిచి మూడోస్థానం దక్కించుకున్నారు. ఆనాడు కాంగ్రెస్ ఓటు బ్యాంకు సీపీఐకి క్రాస్ కాలేదు. అప్పుడు వైసీపీ అభ్యర్థిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డికి బదిలీ కావడంతో సీపీఐ ఓటమి చెందాల్సి వచ్చింది. గతంలో పోటీచేసిన అనుభవం దృష్టిలో పెట్టుకుని సీపీఐ ఖమ్మం టికెట్ అడుగుతోంది. సీపీఎం మాత్రం ఒంటరిగానే పోటీ చేస్తామని ప్రకటనలు ఇస్తోంది.

ఖమ్మం నుంచే ఎన్నికల శంఖారావం

- రేపు లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమావేశం
- హాజరుకానున్న మాజీ మంత్రి హరీష్‌రావు
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ వెల్లడి

7



సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

గిరిజన భవన్‌లో వివిధ శాఖలతో సీఎం సమీక్ష

- అధికారులందరూ నివేదికలతో సిద్ధంగా ఉండాలి
- బహిరంగసభకు విస్తృత ఏర్పాట్లు చేయాలి
- రామాలయ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ రెడీ చేయాలి
- అధికారులతో సమీక్షలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఈనెల 11న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అన్నిశాఖల అధికారులతో సమీక్షించారు. కొత్తగూడెంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఎస్పీ రోహిత్, ఐటీడీఏ పీవో ప్రతిక్ జైన్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశమయ్యారు.

ముఖ్యమంత్రి రామాలయ దర్శనం అనంతరం జిల్లాలోని అభివృద్ధి పనులపై రివ్యూ సమావేశానికి గిరిజనభవన్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బూర్గంపహాడ్ మండలంలోని లక్ష్మీపురం గ్రామ సమీపంలో ఎంపిక చేసిన సభాస్థలంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేపట్టాలన్నారు. హెలిప్యాడ్ నిర్మాణం, సభాస్థలికి ఏర్పాట్లు వేగవంతం చేయాలన్నారు. సభకు వచ్చే ప్రజలకు అవసరమైన తాగునీరు ఏర్పాటు చేయాలని, సభా ప్రాంగణంలో హెల్త్‌క్యాంప్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక దళం సిద్ధంగా ఉండాలన్నారు.

జిల్లాలో జరిగే అన్ని అభివృద్ధి పనులు పురోగతిపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ధరణి, ఎల్‌ఆర్‌ఎస్, గృహలక్ష్మి, గృహజ్యోతికి మొత్తం వచ్చిన దరఖాస్తుల వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యశాఖలకు ఇప్పటి వరకు మంజూరైన నిధులు చేపట్టిన పనులు, మనఊరు-మనబడి, జిల్లాలోని అన్ని పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

శ్రీరామనవమి నాటికి భద్రాచలం వద్ద నిర్మిస్తున్న రెండో వంతెన పనులు పూర్తి చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. భద్రాచలం రామాలయ పరిధిలోని భూముల వివరాలు, ఆలయ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ సిద్ధం చేయాలని దేవస్థానం ఈవో రమాదేవిని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, డీఆర్‌వో రవీంద్రనాథ్, జిల్లా పరిపాలన అధికారి గన్య, డీఎంహెచ్‌వో శిరీష, ఈఎస్‌వో రుక్మిణి, భద్రాచలం, కొత్తగూడెం ఆర్డీవోలు కే.దామోదర్‌రావు, మధు, ఆర్‌అండ్‌బీ ఈఈ అర్జున్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, డీఎఫ్‌వో కృష్ణగౌడ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, ఇరిగేషన్ ఎస్సీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



నేలకొండపల్లిలోని డిగ్రీ మోడల్ కళాశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రజలు మార్పు కోరుకున్నారు..

- విద్య, వైద్యాన్ని నిర్లక్ష్యం చేసిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- రెవెన్యూ, హౌసింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి, మార్చి 5: నిరంకుశ పాలనపట్ల విసుగెత్తి ప్రజలు మార్పు కోరుకోవడం వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెంలో వేగినాటి లక్ష్మీనర్సయ్య, మోడల్ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ పరంజ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ మాటలకే పరిమితమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48గంటల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన 6 హామీల్లో రెండిండిని అమలు చేశామన్నారు. రెండు రోజుల క్రితమే రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించినట్లు వివరించారు. 11న భద్రాద్రి రాముడి సాక్షిగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తామని పొంగులేటి తెలిపారు. పాలేరు నియోజకవర్గానికి 3,500ఇళ్లు మంజూరయ్యాయని, ఆ శాఖా మంత్రిని తానే కాబట్టి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందిస్తానన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు ఇవ్వనివారు ఎప్పుడైనా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులివ్వవచ్చన్నారు. ఇప్పటివరకు తనపై చూపిన ప్రేమను ఇలానే కొనసాగించి త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.

మోడల్ డిగ్రీ కళాశాలలో జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు మోడల్ డిగ్రీ కళాశాలలుండగా అందులో ఒకటి నేలకొండపల్లిలో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే 28 వేల ఉద్యోగాలిచ్చామన్నారు. టీఎస్‌పీఎస్సీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయల నాగేశ్వరరావు, వేగినాటి లక్ష్మీనర్సయ్య, నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, శాఖమూరి రమేష్, సీతారాములు, మైసా శంకర్, సైదులు, శ్రీనివాసరావు, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీటీసీలు రేగూరి వాసవి, దోసపాటి కల్పన, బొడ్డు బొందయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి అప్పుడే కటకట

ఖమ్మంలో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్‌ల వద్ద ఎండిపోయిన మున్నేరు

- రోజుకు 60 ఎంఎల్‌డీలకు బదులు 30 సరఫరా
- అడుగంటిన పాలేరు జలాశయం
- దానవాయిగూడెం వద్ద ఎండిపోయిన మున్నేరు
- ఎండలు ముదరక ముందే ప్రజలకు కష్టకాలం

ఖమ్మం కార్పొరేషన్, మార్చి 5: ఎండాకాలం పూర్తిగా రాకముందే ఖమ్మం నగరంలో నీటి ఎద్దడి ఏర్పడింది. పాలేరు జలాశయంలో నీటిమట్టం అడుగంటడంతో ఆ ప్రభావం ఖమ్మం నగరంపై పడింది. పాలేరునుంచి మున్నేరుకు నీటి సరఫరా నిలిచిపోవటంతో దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్ల వద్ద నీటిమట్టం పూర్తిగా పడిపోయింది. దీంతో నగరంలో నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం కూసుమంచి మండలం జీళ్లచెరువు వద్ద రిజర్వాయర్ నుంచి వచ్చే మిషన్ భగీరథ నీళ్లే దిక్కయ్యాయి.

రోజుకు 60 మిలియన్ల లీటర్లు

ఖమ్మం నగరవాసులకు రోజుకు 60 మిలియన్ లీటర్ల తాగునీరు అవసరమవుతుంది. అందులో మిషన్ భగీరథ ద్వారా 30 మిలియన్ లీటర్లు, దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్ ద్వారా 30 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే దానవాయిగూడెం వద్ద మున్నేరు ఎండిపోవటంతో అక్కడి నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో కేవలం 30మిలియన్ లీటర్ల తాగునీరు మాత్రమే సరఫరా అవుతోంది. దీంతో రెండురోజులకు ఒకసారి తాగునీటిని సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు.

వాటర్‌ట్యాంకర్ల ద్వారా...

ఖమ్మం నగరంలో వాటర్‌ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం నగరపాలక సంస్థకు చెందిన 8 ట్యాంకర్ల ద్వారా నీటిని వివిధ ప్రాంతాల ప్రజలకు సరఫరా చేస్తుండగా, ప్రైవేట్ వ్యక్తుల ద్వారా మరో 5 వాటర్‌ట్యాంకర్లతో సరఫరా చేయనున్నారు. నీటిఎద్దడి ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు ఈ ట్యాంకర్లను పంపుతామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం లకారం చెరువు సమీపంలోని ఖానాపురం రక్షిత మంచినీటి పథకం నుంచి తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.



ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్న దృశ్యం

ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండండి



- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచన
- తాగునీటి ఎద్దడిపై విస్తృత సమీక్ష

6

నేను పార్టీ మారడం లేదు



భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలం, మార్చి 5: తనను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయనని, తాను పార్టీ మారడం లేదని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు. భద్రాచలంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను ముఖ్యమంత్రిని, మంత్రులను కలిసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి తన శాయశక్తులా కృషి చేస్తున్నానన్నారు. 11న సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలం రానున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని రకాల సమస్యలను నాయకులు, కార్యకర్తల నుంచి సేకరించి ముఖ్యమంత్రికి నివేదిస్తానని పేర్కొన్నారు. సమా వేశంలో భద్రాచలం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరికెల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, అన్నెం సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.



తీర్మానాలను ప్రవేశ పెడుతున్న మాస్‌లైన్ జాతీయ నాయకుడు పోటు రంగారావు

కమ్యూనిస్టు విప్లవ శక్తులు ఏకం కావాలి

- ఫాసిజంపై జాతీయస్థాయిలో 'మాస్‌లైన్' పోరాటం
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర నాయకుడు సంజయ్ సింఘ్వీ
- ముగిసిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రతినిధుల మహాసభలు
- పలు తీర్మానాలకు ఏకగ్రీవ ఆమోదం

6

10న ఎన్వీ రమణకు ఆత్మీయ సత్కారం



ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 5: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణకు ఈ నెల 10న ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్నట్లు ఖమ్మం కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు తెలిపారు. నగరంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలోని స్వర్ణభారతి కల్యాణమండలంలో 10న ఉదయం రమణ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం పేరుతో అభినందన సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరవుతారని తెలిపారు. వీరితోపాటు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ (కాంగ్రెస్), తాతా మధుసూదన్ (బీఆర్‌ఎస్), కూనంనేని సాంబశివరావు, పోటు ప్రసాద్ (సీపీఐ), యర్రా శ్రీకాంత్ (సీపీఎం), డాక్టర్ వాసిరెడ్డి రామనాధం (తెలుగుదేశం), గోకినపల్లి వెంకటేశ్వర్లు (మాస్‌లైన్), గల్లా సత్యనారాయణ (బీజేపీ) పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గొడవర్తి నాగేశ్వరరావు, కోశాధికారి నల్లమోతు రఘు, ఈసీ మెంబర్లు బండి మాధవరావు, రావూరు సైదబాబు, తూము శివ తదితరులు పాల్గొన్నారు.



హాలో.. 'పూనం'

- పోలీసు కమిషనరేట్‌కు చేరుకున్న జాగిలం
- మోయినాబాద్‌లో 8 నెలల కఠోర శిక్షణ

7

కమ్యూనిస్టు విప్లవ శక్తులు ఏకం కావాలి

● సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ కేంద్ర నాయకులు సంజయ్ సింఘ్వీ



పొటో ఎగ్జిబిషన్‌ను వీక్షిస్తున్న మాస్‌లైన్ జాతీయ నాయకులు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 5: కమ్యూనిస్టు విప్లవ శక్తులను ఏకం చేయటానికి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కృషి చేస్తుందని ఆ పార్టీ జాతీయ నాయకుడు సంజయ్‌సింఘ్వీ పేర్కొన్నారు. పాలిస్తీనాపై ఇజ్రాయిల్ దూకుడుగా వ్యవహ రించటం వెనుక అమెరికా హస్తం ఉందని ఆరోపించారు. ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రెండోరోజు ప్రతినిధుల సభలో సంజయ్‌సింఘ్వీ ప్రసంగించారు. ఒకప్పుడు ప్రపంచంలో సగ భాగాన్ని పరిపాలించిన కమ్యూనిస్టు మరియు సోషలిస్టు పార్టీలు ఇప్పుడు అల్పంగా మా రాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కారణంగా ఫాసిజం ప్రమాదకరమైన స్థాయికి పెరిగిందన్నారు. మూడు విప్లవ సంస్థలు ఒకే జాతీయ పార్టీగా ఆవిర్భావించటం చారిత్రక అవసరమన్నారు. పార్టీ నిబంధన అంశాలపై పోటు రంగారావు మాట్లాడారు.

వామపక్ష భావజాలం కలిగిన ఖమ్మం వేదికగా సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రెండోరోజు ప్రతిని దుల సభలు విప్లవ శక్తులకు, మేదావులకు ఆశావాహంగా జరిగాయి. రెండోరోజు 15రాష్ట్రాలకు చెందిన 292 మంది డెలిగేట్స్ ప్రతినిధుల సభకు హాజరయ్యారు. రాజకీయ నిర్ణయాలు, ప్రజా, కార్మిక, రైతు సంఘాల నిర్మాణాలపై పలు రాష్ట్రాల డెలిగేట్స్ మాట్లాడారు. సభలో సూర్యం, పోటు రంగారావు, భాస్కర్‌రావు, దినేష్‌గోహైన్ వెనా తీర్మాణాలను సభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. అరుణోదయ కళాకారులు దేశంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రదర్శనలు చేశారు. మాస్‌లైన్ ఆవిర్భావం సందర్భంగా ఏర్పాటు చేసిన పొటో ఎగ్జిబిషన్ ప్రతినిధులను ఆకట్టుకొంది. స్టీరింగ్ కమిటీ సభ్యులుగా ప్రదీప్‌సింగ్ ఠాగూర్, కెచ్చల రంగయ్య, దేవవ్రతశర్మ, ఉమాకాంత్ వ్యవహరించారు.

గురుకుల ఉద్యోగాలకు 275 మంది ఎంపిక

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 5: గురుకులాల్లో వివిధ ఉద్యోగ నియామకాలకు ఖమ్మం జిల్లా నుంచి 275 మంది ఎంపికయ్యారు. వీరిలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ), లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్ ప్రొవిజనల్ సెలక్షన్ లిస్టును ప్రకటించింది. వీరిలో ఖమ్మం జిల్లా నుంచి 275 మంది వివిధ పోస్టులకు ఎంపికయ్యారు. డిగ్రీ కళాశాల అధ్యాపకులుగా 35 మంది, జూనియర్ కళాశాల అధ్యాపకులుగా 101, టిజిటిలుగా 139, మొత్తం 275 పోస్టులకు ఎంపికయ్యారు. గత పదేళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ లేకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందారు. తెలంగాణలో నూతన ప్రభుత్వం వచ్చాక తక్కువ కాలంలోనే ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకం చేపట్టడంతో అభ్యర్థుల్లో ఆనందోత్సవాలతో సంబురాలు చేసుకుంటున్నారు.

మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు

● పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ గౌతమ్, అధికారులు

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 5: నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్ష గణితం పేపర్‌లో ఓ విద్యార్థిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైనట్లు మంగళవారం డీఐఈవో రవిబాబు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 70 పరీక్షా కేంద్రాల్లో ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు. మొత్తం 17,163 మంది విద్యార్థులకు గాను 16,671 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలని పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తనిఖీ చేశారు. ఉన్నతాధికారులు పలు పరీక్షా కేంద్రాలను తనిఖీలు చేశారు.

'శ్రామిక మహిళా విముక్తి కోసం పోరాడుదాం'

పినపాక, మార్చి5: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శ్రామిక మహిళా విముక్తి కోసం పోరాడుదామని భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ ఆజాద్, చర్ల-శబరి ఏరియా డివిజన్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ అరుణలు పిలుపునిస్తూ మంగళవారం లేఖలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మహిళల పట్ల అమానుష దాడులను ముక్తకంఠంతో ఖండించాలన్నారు. స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీ, పేద మహిళ రైతుల శ్రమ దోపిడికి గురవుతోందని లేఖలో పేర్కొన్నారు. పట్టణాల్లో మహిళా కార్మికులు తక్కువ వేతనాలతో శ్రమ దోపిడికి, లైంగిక అత్యాచారాలకు గురవుతుండడం ఆవేదనకు గురి చేస్తుందన్నారు. మహిళా ఉద్యమాలతో స్వేచ్ఛ, సమానత్వంతో పాటు, శ్రమ దోపిడి రహిత సమసమాజాన్ని నిర్మించుకునేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ప్రేరణగా నిలవాలని పిలుపునిచ్చారు.

104 వాహనాలకు సుస్తీ

▸▸ నిరుపయోగంగా 23 వాహనాలు ▸▸ పట్టించుకోని అధికారులు ▸▸ వినియోగంలోకి తేవాలని స్థానికుల వేడుకోలు



నిరుయోగంగా ఉన్న 104 వాహనాలు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి5: చిన్నాచితక వ్యాధులు వస్తే వైద్యం కోసం పల్లెవాసులు ఇబ్బందులు పడకుండా, గర్భిణులు బాలింతలకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలందించడానికి ఒకప్పుడు 104 అంబులెన్స్ సేవలు జిల్లా వాసులకు ప్రయోజనం కలిగించాయి. సరైన నిర్వహణ లేకపోవడం, వీటిని నిర్వహించలేక గత ప్రభుత్వం రెండేళ్ల క్రితం రద్దు చేసింది. దీంతో విలువైన వాహనాలు మూలనపడ్డాయి. 104 కింద పనిచేసిన ఉద్యోగులను అధికారులు అక్కడక్కడా సర్దుబాటు చేసినప్పటికీ, వాహనాలను మాత్రం వేలం వేయడంలో మాత్రం అలక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. దీంతో విలువైన వాహనాలు తుప్పుపట్టిపోయి పనికిరాకుండా పోతున్నాయి.

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2008లో అప్పటి ప్రభుత్వం104 అంబులెన్స్ కింద 25 వాహనాలను కేటాయించింది. రాష్ట్ర విభజన సందర్భంగా రెండు అంబులెన్స్‌లు ఏపీకి కేటాయించగా, 23 వాహనాలు మిగిలాయి. జిల్లా విభజన సందర్భంగా ఖమ్మానికి 11, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 12 కేటాయించారు. సీజనల్ వ్యాధులు, గర్భిణులు, బాలింతలకు అవసరమైన ప్రాథమిక చికిత్సలు, మధుమేహం, రక్తపోటు, ఇతర వ్యాధుల బారిన పడిన గ్రామీణులకు చికిత్సల కోసం సుదూరంలో ఉండే ఆరోగ్య ఉపకేంద్రాలు పీహెచ్‌సీలకు వెళ్లాల్సి వచ్చేది, దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేంది. ఈ ఇబ్బందులను తొలగించేందుకు 104 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చి సేవలందించారు.

గ్రామాల్లో ఇబ్బందులు పడుతున్న రోగులు

ఒక్కో వాహనానికి పైలెట్ (డ్రైవర్) ఫార్మాసిస్టు, టెక్నీషియన్లను నియమించి, విధులు నిర్వహించేవారు. ఒక్కో అంబులెన్స్ నిర్ణీత రోజుల్లో వారికి కేటాయించిన గ్రామాలకు వెళ్లి ప్రజలకు సేవలందించేవారు. అయితే ఈ వాహనాలను నిర్వహించలేక, సకాలంలో మరమ్మతులు చేయించలేకపోవడంతో మూలనపడిపోయాయి.

వాహనాలకు డీజిల్, మందుల కొరత, సిబ్బందికి వేతనాలు ఇవ్వక పోవడంతో ఇవి నిరుపయోగంగా మిగిలిపోయాయి. దీనికి తోడు తెలంగాణ ప్రభుత్వం పల్లె దవాఖానాలు ఏర్పాటు చేయడం, ఎన్‌సీడీ కార్యక్రమం ద్వారా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్యంతో పాటు మందులు అందజేస్తుండడంతో వాహనాల అవసరం లేదని ప్రభుత్వం భావించి ఈ సేవలను రద్దు చేసింది.

104లో పనిచేసిన 155 మంది సిబ్బందిని వివిధ విభాగాల్లో సర్దుబాటు చేసింది. ఖమ్మం జిల్లాలో 11 వాహనాలకు 86 మంది, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 12 వాహనాలకు 69 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డ్రైవర్లు, సర్‌ప్లస్ స్టాఫ్, ఆఫీస్ అసిస్టెంట్లు, సెక్యూరిటీ గార్డులు, ఏఎన్‌ఎంలు, ఆఫీస్ సబార్డినేట్లు అందరినీ సర్దుబాటు చేశారు. కానీ ఎంతో విలువైన వాహనాలను మాత్రం రెండేళ్లుగా అక్కడే వదిలేశారు. దీంతో ఆ వాహనాలకు ఉన్న పరికరాలు, టైర్లు ఇతర విడి భాగాలు తస్కరణకు గురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనాలను వేలం వేసి ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని పలువురు కోరుతున్నారు.

ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండండి: మంత్రి తుమ్మల

ఖమ్మం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి రెవెన్యూ, ఇరిగేషన్, పబ్లిక్‌హెల్త్, మిషన్‌భగీరథ, పోలీసుశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రణాళికలతో పర్యవేక్షణ చేయాలని మంత్రి సూచించారు. పాలేరు, వైరా, లకారం, లంకపల్లి, జలాశయాలలో నీటి లభ్యతను వచ్చే నాలుగు నెలల వరకు ఉండేలా చూడాలన్నారు. బేతుపల్లి, బోడేపుడి సుజల స్రవంతి పథకం, మిషన్‌భగీరథకు ఎన్‌ఎస్‌పీ ద్వారా నీటిని సమకూర్చుకుంటే భూగర్భజలాలు పెరగడంతోపాటు బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరుగుతుందని, తద్వారా పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సమస్య కొంత నివారించగలమని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్‌తోపాటు లకారంలో 5 ఎంఎల్‌డీ ఫిల్టర్‌బెడ్స్ ద్వారా నగరంలో నీటి సరఫరా చేస్తున్నామన్నారు. మిషన్‌భగీరథ ఇంటెక్‌వెల్ ద్వారా రోజువారి వినియోగానికి కావాల్సిన నీటి లభ్యతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. జలాశయాలతోపాటు గ్రామాల్లోని బోర్లను పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. రోజువారి వినియోగం కోసం 0.13టీఎంసీ అవసరం అవుతుందని ఏప్రిల్ 1 నాటికి 1టీఎంసీ నీటిని సమకూర్చుకున్నట్టయితే వచ్చే నాలుగు నెలల వరకు ఇబ్బందులుండవని తెలిపారు.

కార్పొరేషన్ పరిధిలో 33 ఎంఎల్‌డీ సప్లయ్ చేసేవారమని, మరో 5ఎంఎల్‌డీ పెంచడం జరిగిందని, ఇప్పటి వరకు 4 మోటార్లు పనిచేస్తున్నాయని, మరో మోటార్ కూడా సిద్ధం చేశామని, 5 మోటర్ల ద్వారా నీటి సరఫరా ఏర్పాట్లు చేస్తున్నామని ఇరిగేషన్ అధికారులు వివరించారు. పోలీసు కమిషనర్ సునీల్‌దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, శిక్షణ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్, ఇరిగేసన్ ఎస్ఈ ఆనంద్‌కుమార్, మిషన్‌భగీరథ ఎస్ఈ సదాశివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు జాతీయ ఉద్యాన ప్రదర్శనలో ఖమ్మం రైతులు

ఖమ్మం వ్యవసాయం, మార్చి 5: బెంగళూరులోని జాతీయ ఉద్యాన పరిశోధనా స్థానంలో మూడు రోజులపాటు జరిగే



ప్రదర్శనలో పాల్గొన్న ఖమ్మం జిల్లా రైతులు

జాతీయ ఉద్యాన మేళాకు 2024 దేశ నలమూలాల నుంచి 20 రాష్ట్రాలు మరియు ఈశాన్య రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారని జిల్లా ఉద్యాన అధికారి అనసూయ తెలిపారు. వ్యవసాయ మంత్రి మంత్రి నాగేశ్వరావు ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా నుంచి రైతు నాయకుడు నల్లమల్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 50 మంది అభ్యుదయ రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల రైతులు పాల్గొన్నారని పేర్కొన్నారు. వివిధ రకాల కంపెనీ సంస్థల 230 రకాల స్టాళ్లను ఏర్పాటు చేయగా ఖమ్మం రైతులు పరిశీలించారు. ఉద్యాన ప్రదర్శనకు జిల్లా నుంచి ఉద్యాన అధికారులు ఏ.వేణు, నగేష్ మరియు రైతులు నల్లమల వెంకటేశ్వరరావు, వెంపటి లక్ష్మీనారాయణ, నెల్లూరి వీరబాబు, జంగా రవీందర్ రెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

పార్టీలు మారే విధానం వద్దు

● ములకపాడులో ఆదివాసీల పేరిట వెలసిన ఫ్లెక్సీ



ములకపాడులో వెలిసిన ఫ్లెక్సీ

దుమ్ముగూడెం మార్చి 5: గెలిపించిన కార్యకర్తలను అవమానపర్చే విధంగా పార్టీలు మారే విధానాన్ని భద్రాచలం నియోజకవర్గంలో తీసుకురావద్దంటూ ఆదివాసీల పేరిట ములకపాడు కూడలిలో మంగళవారం ఫ్లెక్సీ ప్రత్యక్షమైంది. మాజీ ఎమ్మెల్యేలు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య, గుమ్మడి నర్సయ్యలు ఆదివాసీ జాతి కీర్తి ప్రతిష్టలను నలుదిక్కులా వ్యాపించేలా జీవించారని పేర్కొన్నారు. ప్రజల నిర్ణయాన్ని, కార్యకర్తల శ్రమను, నాయకుల తెగింపును తక్కువగా చూసి మీదారి మీరు చూసుకోవడం హేయమైనదిగా వర్ణించారు. భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పార్టీ మారతారనే ఊహాగానాల నడుమ ఈ ఫ్లెక్సీలోని వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

'బెల్టు షాపులను రద్దు చేయాలి'

ఏన్కూరు,మార్చి5: గ్రామాల్లో వెంటనే బెల్టు షాపులను రద్దు చేసి ప్రభుత్వ హామీని నెరవేర్చాలని సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏన్కూరులో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు బెల్టు షాపులను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సమితి సభ్యులు తెప్పల సత్యం, అమరనేని వీరభద్రం, మేడ భూషయ్య, మాదినేని వెంకన్న పాల్గొన్నారు.

రైతు వేదికలకు కొత్త రూపు

ఖమ్మం వ్యవసాయం, మార్చి 5: రైతు వేదికలను దృశ్య, శ్రవణ(వీడియో కాన్ఫరెన్స్) కేంద్రాలుగా మార్చే ప్రక్రియలో భాగంగా బుధవారం జిల్లాలో ఐదు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం దృశ్య, శ్రవణ కేంద్రంగా ఏర్పాటు చేయడానికి పైలెట్ ప్రాజెక్టుగా నియోజకవర్గానికి ఒక రైతు వేదికను ఎంపిక చేసింది. వీటిని రాష్ట్రస్థాయిలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. వీటి ద్వారా రైతులకు వ్యవసాయ, ఉద్యాన, పట్టు, మల్బరీ, మత్స్య, పశుసంవర్ధక, విద్యుత్, నీటిపారుదల శాఖలకు సంబంధించిన అన్ని ప్రభుత్వ పథకాలు, వివిధ సమాచారం అందించనున్నారు. సేవల ద్వారా రైతులకు ఎంతమేర ప్రయోజనం ఉంటుందో, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి తర్వాత రైతు వేదికలన్నింటిలోనూ వంద శాతం ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఇందుకు సంబంధిత శాఖల నుంచి ప్రత్యేక దృష్టి సారించి రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సాగులో మెలకువలు, శాస్త్ర సాంకేతిక పద్ధతులు తెలిసేలా చూడాలని నిర్ణయించారు. జిల్లాలో సత్తుపల్లి(కొర్లగూడెం), వైరా (తనికెళ్ల), మధిర(బోనకల్), పాలేరు(కూసుమంచి), ఖమ్మం(వీవీ.పాలెం) నియోజకవర్గాల్లో ఒక్కో వేదికలో అత్యాధునిక వీడియో కాన్ఫరెన్సు ఏర్పాట్లను ప్రారంభించనున్నట్లు సమాచారం.

అనారోగ్యంతో టిఎస్ఎస్పీ కానిస్టేబుల్ మృతి



రమేష్

కరకగూడెం, ఫిబ్రవరి 5: అనారోగ్యంతో టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలో సోమవారం రాత్రి జరిగింది. మండలంలోని చిరుమళ్ల పంచాయతీ పోలకమ్మతోగు గ్రామానికి చెందిన కొమరం రమేష్ (39) ఆరో బెటలియన్ టిఎస్ఎస్పీ 2004 బ్యాచ్ కానిస్టేబుల్‌గా కొత్తగూడెం దాతికొండ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నాడు. కాఆ రమేష్ సోమవారం రాత్రి అనారోగ్యంతో తన ఇంటి వద్ద మృతి చెందాడు. టిఎస్ఎస్పీ ఆరోవ బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి, అడిషనల్ కమాడెంట్ అంజయ్య, బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ స్వామి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

ప్రభుత్వ ఉద్యోగి....

కామేపల్లి: కామేపల్లి మండలం టేకులతండ గ్రామానికి చెందిన లకావత్ రాధాకృష్ణమూర్తి(42) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. మృతుడు రిజిస్టర్ స్టాంప్స్ శాఖలో జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్నాడు. మృతదేహాన్ని గింజల నర్సింహరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, గోపిరెడ్డి, రాంబాబులు సంతాపం తెలిపి నివాళులర్పించారు.

పొంచివున్న ముప్పు

▸▸ శిథిల క్వార్టర్లలోనే నివాసం ఉంటున్న ఉద్యోగులు ▸▸ పాల్వంచలో ఆందోళన కలిగిస్తున్న అధికారుల తీరు





శిథిలావస్థకు చేరిన పాత మునిసిపల్ కార్యాలయం, పోలీస్ క్వార్టర్స్ భవనాలు

పాల్వంచ, మార్చి 5: దశాబ్దాల క్రితం నిర్మితమైన క్వార్టర్లు, భవనాలు అవి.. కాలక్రమంలో శిథిలదశకు చేరాయి.. వాటిని ఎలాంటి అవసరాలకు వాడకూడదని, వాటిని కూల్చివేయాల్సి ఉందని మునిసిపల్ అధికారులు పదే పదే నోటీసులు ఇస్తున్నారు.. అయినా అటు ప్రభుత్వ ఉద్యోగులు, ఇటు ప్రభుత్వ అధికారులు వాటిని ఖాళీ చేయడం లేదు. అందరికీ ఆందోళన కలిగిస్తున్న ఈ పరిస్థితి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నెలకొంది.

పాల్వంచ నడి బొడ్డున అటవీశాఖ టెరిటోరియల్ కార్యాలయం ఉంది. 1970 దశకంలోనే ఇందులో ఎంతో మంది ఉద్యోగులు విధులను నిర్వర్తించేవారు. అప్పట్లో సిబ్బంది నివాసముండటానికి క్వార్టర్లను నిర్మించారు. కాలక్రమేణా క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి నివాసముండటానికి అనువుగా లేవని, ప్రమాదాలు జరిగే అవకాశ ఉందని గ్రహించి 2011లో పాల్వంచ ఎఫ్‌డీఓగా విధులు నిర్వర్తించిన శాంతి ప్రియ పాండే క్వార్టర్లను ఖాళీ చేయాలని ఆదేశించారు. అనంతరం కొద్ది రోజులకే ఆమె బదిలీపై వెళ్లడంతో అందులో నివాసముంటున్న కుటుంబాలు ఖాళీ చేయకుండా అందులోనే నివాసముంటున్నారు. వర్షం పడితే కురుస్తున్నా ఇంటి పై కప్పును పరదాలతో కప్పి మరీ నివాసముంటున్నారు.

ఉద్యోగులే కాదు, అధికారుల తీరు కూడా అలాగే ఉంది. మండల పరిధిలోని కేశవాపురంలో 1980వ దశకంలో నవభారత్ వెంచర్స్ వారి సహకారంతో ప్రాథమిక పాఠశాలను ప్రభుత్వం నిర్మించింది. అనంతరం చుట్టుపక్కల ఉన్నత పాఠశాలల సంఖ్య పెరగడంతో కేశవాపురం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గింది. దీంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆ భవనం నివాసయోగ్యం కాదని అందరూ భావించినా అధికారులు మాత్రం అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహించడానికి దానిని కేటాయించారు. పైగా అద్దె చెల్లించనక్కర్లేదన్న ఉద్దేశ్యంతో అక్కడ అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తుండటంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కాగా, శిథిల భవనాలకు నోటీసులిచ్చి వాటిని కూల్చి వేయాల్సిన మునిసిపాలిటీ అధికారులు అంతగా స్పందించడం లేదు. పైగా పాత మునిసిపల్ కార్యాలయ భవనం శిథిలమైనప్పటికీ దానిని వినియోగించుకుంటున్న తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇక పోలీసుశాఖలో పని చేసే ఉద్యోగులు సైతం ఇదే తరహాలో తమ కుటుంబాలతో సహా శిథిలమైన క్వార్టర్లలో నివాసముంటున్నారు. 1970వ దశకంలో నిర్మించిన పోలీస్ క్వార్టర్స్ లోనే సిబ్బంది నివాసముండటం విస్మయాన్ని కలిగిస్తున్నది. పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా, కూరగాయల మార్కెట్ రోడ్డు ప్రక్కన, టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా నిర్మించిన ఈ 36 క్వార్టర్లు గతంలోనే శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎన్నోసార్లు వీరికి సంబంధిత అధికారులు ఖాళీ చేయమని నోటీసులు కూడా ఇచ్చారు. రెండు నెలల క్రితం కూడా పోలీసు అధికారులు, మునిసిపల్ అధికారులు వీరికి నోటీసులు జారీ చేశారు. కానీ ఇంతవరకు స్పందన లేదు. శిథిల క్వార్టర్లకు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది అనే ప్రశ్నకు జవాబు చెప్పే వారే కనిపించడం లేదు.

చిన్నారిని కాపాడిన పోలీసులు

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 5: ఖమ్మం నగరంలోని సిటి బస్టాండ్‌లో మంగళవారం ఓ చిన్నారిని ఎత్తుకోని అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓవ్యక్తి నుంచి చిన్నారిని కాపాడి పోలీసుల సమక్షంలో సీడబ్ల్యూసీకి అప్పగించారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతీరాణి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం సిటి బస్టాండ్‌లో ఓ వ్యక్తి 18 నెలల పాపను ఎత్తుకోని అనుమానాస్పదంగా తిరుగుతున్నడని కొందరు ప్రయాణికులకు అనుమానం వచ్చి నిలదీయగా పారిపోయేందుకు ప్రయత్నించాడని తెలిపారు. దీంతో పక్కనే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్స్ కిరణ్, లక్ష్మయ్యలు ఆ వ్యక్తిని పట్టుకోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారని పేర్కొన్నారు. పోలీసులు సమక్షంలో పాపను సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో తీసుకోని నగరంలోని శిశుగృహంలో ఆశ్రయం కల్పించామని తెలిపారు. పాపను తీసుకొచ్చిన వ్యక్తి సరైన సమాధానం చెప్పకపోవడంతోనే చిన్నారిని తీసుకోవటం జరిగిందని తెలిపారు. ఆ వ్యక్తి వివరాలు, చిన్నారి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

భూ వివాదంలో ఘర్షణ

● ముగ్గురికి గాయాలు

చంద్రుగొండ, మార్చి5 : భూ వివాదంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గాయాలపాలైన సంఘటన మండల పరిధిలోని అయ్యనపాలెంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అయ్యనపాలేనికి చెందిన ఆళ్ళకుంట రాధా కుటుంబానికి, అదే గ్రామానికి చెందిన బాలకృష్ణ కుటుంబానికి కొన్నేళ్లుగా ఓ ఇల్లు, ఇంటి స్థలం విషయమై వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో మంగళవారం ఆళ్లకుంట రాధాతో పాటు కుటుంబ సభ్యులు మాదవి, సాయిలు కలసి వివాద స్థలంలోకి వెళ్లారు. ఈ సమయంలో ప్రత్యర్థి వర్గానికి చెందిన బాలకృష్ణ, అతని కుటుంబ సభ్యులు వారిని అడ్డుకొని ఘర్షణ పడ్డారు. సంఘటనలో రాధా, మాధవి, సాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయమై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాల్వంచ, మార్చి5: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన పాల్వం చ మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జూలూరుపాడు మండలానికి చెందిన జక్కుల నరసింహారావు(41) జీవాల మారుబేరం చేస్తుంటాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు గుడపాటి రాముతో కలిసి ద్విచక్ర వాహనంపై అశ్వాపురం వెళ్లి స్వ గ్రామానికి వస్తుండగా పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామశివారులోని తోగ్గూడెం క్రాస్‌రోడ్డు వద్ద లారీ ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న నరసింహారావు అ క్కడికక్కడే మృతి చెందగా, రాముకు తీవ్ర గాయాలయ్యా యి. సంఘటనా స్థలాన్ని సీఐ వినయ్‌కుమార్ పరిశీలించారు. మృతుడి భార్య జక్కుల ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

న్యాయం చేయాలని రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

ములకలపల్లి, మార్చి 5: నకిలీ వరి విత్తనాల మూలంగా తీవ్రంగా నష్టపోయిన గిరిజన రైతులు న్యాయం కోసం ఓ పురుగు మందుల దుకాణం ఎదుట పురుగుమందు డబ్బాలతో బైఠాయించి మంగళవారం ఆందోళన నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం తాళ్లపాయ గిరిజన రైతులు యాసంగి వరిసాగు కోసం ములకలపల్లికి చెందిన ఓ ఫెర్టిలైజర్స్ దుకాణంలో వరి విత్తనాలు కొనుగోలు చేసి నాటు వేశారు. వయస్సు రాక ముందే వరి ఈనింది. దీనిపై రైతులు పోలీస్, వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయకపోతే పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకోవడం ఒక్కటే మార్గమని రైతులు పేర్కొన్నారు. ఈ విషయమై ములకలపల్లి అధికారి కరుణమ్మెని వివరణ అడగగా పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకు ఫెర్టిలైజర్ దుకాణంలో ఎలాంటి అమ్మకాలు జరపవద్దని సూచించారు.

అసైన్డ్ భూమి సర్వే



సర్వే వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్, డిఐవో వెంకటారావు

కల్లూరు, మార్చి 5: కల్లూరు మేజర్ గ్రామ పంచాయితీ శివారు ఖాన్‌ఖాన్‌పేట గ్రామంలో తిరువూరు క్రాస్ రోడ్డు వద్ద గల సర్వే నెంబరు 5/2 ప్రకారం గల అసైన్డ్ భూమిపై మంగళవారం క్షేత్ర స్థాయిలో ఆర్డీవో శ్రీనివాస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకటారావుల సమక్షంలో సమగ్ర సర్వే నిర్వహించారు. 1975 వసంత్సరంలో నాటి సత్తుపల్లి తాలుకగా ఉన్న సమయంలో కొంతమంది గిరిజనులకు నాడు ప్రభుత్వం తరుపున సర్వేనెంబరు 5/2 ప్రకారం గల అసైన్డ్ భూమిలో ఎకరం 1.10 కుంటలు. ఎస్‌డిఆర్ ప్రకారం మరో 36 కుంటల స్థలంలో నాడు 21 మంది గాను పట్టాలు ఇచ్చారని ఆధారాలు చూపిస్తూ ఖాన్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన కున్‌సోతు రవికుమార్, సక్రితో పాటుగా మరికొందరు 2004 సంవత్సరంలో హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు వారు తుది కసరుత్తుగా పిటిష న్‌దారులకు ముందుగానే రెవెన్యూశాఖ తరుపున నోటిసులు పంపారు. తమ ఆధారాలను సర్వే సమయంలో అందించాలని తెలియపర చటంతో వారు కూడ సదరు భూమి వద్దకు హాజరయ్యారు. వివాదంలో గల ఈ స్థలంపై సమగ్ర సర్వే జరపి తుది నివేదికను అందించాలని కోర్టు మార్గదర్శకాలు జారీ చేయటంతో కలెక్టర్ ఆదేశాల ప్రకారం సదరు భూమిపై క్షేత్ర స్థాయిలో కల్లూరు ఆర్డీవో శ్రీనివాస్, డిఐఓ వెంకటారావుల సమక్షంలో సర్వే చేశారు. ఈ సర్వే నివేదికను బహిరంగ పరచకుండా కోర్టు వారికి అందజేయాలని సూచించనట్లు అధికారులు తెలిపారు.

మావోయిస్టు దంపతుల అరెస్టు

దుమ్ముగూడెం మార్చి 5: భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండల సరిహద్దున ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కిష్టారం పోలీసులు మంగళవారం అనేక నేరాలతో సంబంధం ఉన్న మావోయిస్టు దంపతులు సోడి హిడమా, మడివి మాసలను అరెస్ట్ చేశారు. మావోయిస్టు ఉత్తర బస్తర్ డివిజన్ ఐదో నెంబర్ బెటాలియన్‌లో పన్నెండేళ్ల నుంచి వీరు పలు విధ్వంసక కార్యకలాపాల్లో పాల్గొన్నారు. అరెస్టయిన వారి నుంచి భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంటిలెజన్స్ సమాచారం మేరకు డీఆర్జీ, స్థానిక పోలీసు బలగాలు వీరిని అరెస్టు చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

రూ.లక్షల విలువైన చెట్ల నరికివేత

▸▸ వృక్షాలను కాపాడాలని స్థానికుల వినతి

వైరా, మార్చి 5: రోడ్డు వెడల్పు కోసం చెట్ల నరికివేతకు ఇచ్చిన అనుమతిని ఆసరా చేసుకొని కాంట్రాక్టర్లు రూ.లక్షల విలువైన భారీ చెట్లను తొలగిస్తున్నారు. అది కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బంది కనుసన్నల్లోనే జరుగుతుందని సమాచారం. వైరాలోని జాతీయ ప్రధాన రహదారి నుంచి జగ్గయ్యపేట-మధిర వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు 1.6కిలోమీటర్ల దూరం అభివృద్ధికి గత ప్రభుత్వ హయాం లో రూ.12కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యా యి. ఆర్‌అండ్‌బీ అధికారులతో వచ్చిన ఆదేశాలతో హడావుడిగా రోడ్డుకు రెండువైపులా ఉన్న భారీ చెట్లను నరికివేసే కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారులు నిర్ణయించిన రేట్ల ప్రకారమని కలప కాంట్రాక్టర్ నామమాత్రంగా ప్రభుత్వానికి చలానా రూపం లో డబ్బు చెల్లించారు. అయితే ఇదే అదునుగా భావించి వైరా నుంచి సోమవరం వరకు మూడుకిలోమీటర్ల దూరంలోని ప్రభుత్వానికి చెల్లించిన చలానా సొమ్ముకు మించి ఏడెనిమిది రెట్లు చేసే లక్షలాది రూపాయలు విలువ చేసే కలపను కాం ట్రాక్టర్ కొల్లగొడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ చెట్ల నరికివేతను చూస్తూ నివారించే ప్రయత్నం చేయటం లేదనే విమర్శలున్నాయి. అయితే ఇంకా రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు కానప్పటికీ సోమవరం వరకు నిధులు మంజూరయ్యాయని సంబంధిత కలప కాంట్రాక్టర్ తనను ప్రశ్నించిన వారికి సమాధానం ఇస్తుండటం కొసమెరుపు.

ఈ విషయమై వైరా ఆర్‌అండ్‌బీ డీఈఈ దేవికా చౌహాన్‌ను వివరణ కోరగా తాము అభివృద్ధి చేసే వరకు మాత్రమే పూర్తిగా చెట్లను తొలగించేందుకు అనుమతి ఇచ్చామన్నారు. సోమవరం వరకు ఉన్న రోడ్డులో రెండు వైపులా రోడ్డుపైకి వచ్చిన కొమ్మలు వాహనాలు అడ్డుగా వస్తున్నందున వాటిని మాత్రమే తొలగించాలని సూచించామని పూర్తిగా చెట్లు తొలగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చెట్లు నరుకుతున్న దృశ్యం

కొనసాగుతున్న ఇంటర్ స్పాట్

ఖమ్మం ఖానాపురంహవేలి/చుంచుపల్లి మార్చి 5: ఇంటర్ స్పాట్ వ్యాల్యూషన్ మంగళవారం ఖమ్మం నగరంలోని ప్రభుత్వ కళాశాల నయబజార్ జూనియర్ కళాశాలలో రెండో రోజు సంస్కృతం పేపర్ల వ్యాల్యూషన్‌కు మొత్తం 34 మంది అధ్యాపకులను కేటాయించగా మంగళవా రం రోజు 30 మంది అధ్యాపకులే రిపోర్ట్ చేసినట్లు ఏఎస్‌ఓ జనరల్ డాక్టర్ కుతుంబాక శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్పాట్ వ్యాల్యూషన్ నిర్వహించారు. మొత్తం 18050 మొదటి రోజు 390 పేపర్లు, రెండోరోజు 450 పేపర్ల వ్యాల్యూషన్ పూర్తైనట్లు ఏఎస్‌ఓ శ్రీనివాసరావు తెలిపారు.

భద్రాద్రిలో కొనసాగుతున్న ఇంటర్ స్పాట్

చుంచుపల్లి: భద్రాద్రి జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్ష మూల్యాంకన కేంద్రం కొత్తగూడెం సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలో రెండో రోజు కొనసాగింది. ఈ మూల్యాంకన కేంద్రంలో సంస్కృతం సబ్జెక్టుకు సంబంధించిన జవాబు పత్రాలను ఖమ్మం నుంచి సుమారు 5 వేలకు పైగా వచ్చాయి. మిగతా జవాబు పత్రాలు మూల్యాంకన కేంద్రానికి వస్తాయని ఈ మూల్యాంకన కేంద్రం ఐదుగురు ఎస్కార్ట్ బృందంతో పర్యవేక్షించినట్లు భద్రాద్రి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారిని సులోచనరాణి తెలిపారు.

టెట్టా.. ఎట్టెట్టా..

- ఉద్యోగోన్నతులు పొందే ఉపాధ్యాయులకు షాక్
- 70 శాతం ప్రమోషన్లతో, 30 శాతం నేరుగా ఎస్‌ఏల భర్తీ
- టెట్ నిర్వహణపై సందిగ్ధం.. ఖాళీలతోనే నడవనున్న బడులు

బోనకల్, మార్చి 5: ఒకే కేడర్‌లో దశాబ్దాల తరబడి ప్రమోషన్లు పొందకుండా పని చేయడం ఉద్యోగుల్లో తీవ్ర నైరాశ్యానికి కారణమవుతోంది. కేవలం విద్యాశాఖలోనే ప్రమోషన్లు పొందటానికి ఉపాధ్యాయులు పడుతున్న మానసిక బాధలు వర్ణనాతీతం. ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌జీటీగా 25 ఏళ్ల సర్వీసు ఉన్నప్పటికీ ఇంకా కొందరికి ప్రమోషన్లు అందలేదు.


ఉద్యోగోన్నతి పొందేందుకు ప్రస్తుతం ఉపాధ్యాయులకు టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) అడ్డంకిగా మారింది. 2012 డీఎస్సీ ముందు ఉపాధ్యాయులంతా టెట్ లేకుండా డీఎస్సీ ద్వారా ఎంపికయ్యారు. వీరు గతంలో సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు కూడా పొందారు. గత ఎనిమిదేళ్లగా టెట్, డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నారు.

టెట్ ఉంటేనే ప్రమోషన్..

గత ఏడాది అక్టోబరు నెలలో ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయగా స్కూల్ అసిస్టెంట్లు ప్రమోషన్ల ద్వారా ప్యానల్ గ్రేడు హెచ్‌ఎంలు అయ్యారు. దీంతో స్కూల్ అసిస్టెంట్ బదిలీల వరకు సజావుగానే సాగింది. ఎస్‌జీటీలకు పదోన్నతులు ఇచ్చేందుకు అంతా సిద్ధం చేయగా టెట్ పరీక్ష ద్వారా ఉద్యోగాల్లోకి వచ్చిన కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. జాతీయ విద్యా విదాన మండలి, విద్యాహక్కు చట్టం ప్రకారం టెట్ పరీక్ష ఉత్తీర్ణత ఉంటేనే పదోన్నతులు కల్పించాలని వారు పిటిషన్లో పేర్కొనడంతో పదోన్నతులు నిలిచిపోయాయి.

పోస్టుల భర్తీ గరిష్టంగా పదోన్నతులతోనే..

స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 70శాతం సీనియార్టీ ప్రకారం ఎస్‌జీటీలకు ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేస్తారు. 30శాతం పోస్టులను మాత్రం డీఎస్సీ పరీక్ష ద్వారా తీసుకుంటారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 765 ప్రాథమిక, 190 ప్రాథమికోన్నత, 229 ఉన్నత పాఠశాలల్లో మొత్తం 5,760 టీచర్ పోస్టులు ఉండగా ప్రస్తుతం 4,789 మంది పని చేస్తున్నారు. అన్ని క్యాడర్లల్లో కలిపి 971 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎస్‌ఏ-గణితం 102, ఫిజిక్స్ 8, బయాలజీ 114, ఇంగ్లీషు 23, సోషల్ 176, తెలుగు 45, హిందీ 31, పీడీ 13, ఎల్‌ఎఫ్‌ఎల్ 70 పోస్టులు ఉన్నాయి. ఉన్నత పాఠశాలల్లో 358 పోస్టులను ప్రమోషన్ల ద్వారా, 154 పోస్టులు నేరుగా డీఎస్సీ ద్వార భర్తీ కానున్నాయి. ప్రమోషన్ల ద్వారా పోస్టులను భర్తీ చేయక పోతే డీఎస్సీ జరిగినా పూర్తిస్థాయిలో ఖాళీలు నిండే అవకాశం లేదు.



టెట్ నిర్వహణ తప్పనిసరిగా చేపట్టాలని కోర్టు స్పష్టం చేయడంతో గత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం ఉపాధ్యాయ నియామకాల కోసం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడంతో తాజాగా ప్రమోషన్ల వ్యవహారం పై చర్చ జరుగుతోంది.

టెట్ నిర్వహణ పై సందిగ్ధం ..

టెట్ నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. విద్యారంగం బలోపేతంపై ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణతోపాటు నిలిచిపోయిన గురించి ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. ప్రమోషన్లు లేకుండా నేరుగా పోస్టులను భర్తీ చేసినా ఖాళీలతోనే బడులు కొనసాగడంతో పాటు సీనియర్ ఉపాధ్యాయులు జూనియర్లుగా మిగిలే అవకాశం ఉంది. ప్రమోషన్లు, పోస్టుల భర్తీ అన్ని ఒకే గొడుగు కింద ఉన్న అంశాలు కావడంతో కచ్చితంగా టెట్ నిర్వహించి ప్రమోషన్లు కల్పిస్తే పూర్తిస్థాయి పోస్టులు భర్తీ అవుతాయని, ఆ దశగా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఆదివాసీల వింత ఆచారం

- వ్యక్తి మరణిస్తే ఘనంగా దహనసంస్కారాలు
- ఏడాది తరువాత భీముని పండుగ తరువాతనే కర్మకాండల తంతు
- చర్ల మండలం కందిపాడులో ఆరుగురికి సామూహిక కర్మలు
- పాల్గొన్న 500 మంది ఆదివాసీలు

చర్ల, మార్చి 5: సాధారణంగా మన దేశంలో వ్యక్తి మరణిస్తే అంత్యక్రియలు పూర్తి చేసిన కొద్దిరోజుల్లోనే కర్మకాండలు నిర్వహిస్తారు. కానీ ఛత్తీస్‌గఢ్ నుంచి భద్రాద్రి జిల్లాకు వలస వచ్చిన ఆదివాసీలు మాత్రం, ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. కర్మకాండల విషయంలో వైవిధ్యమైన ఆచారాన్ని పాటిస్తున్నారు. ఎవరైనా మృతి చెందితే మృతదేహానికి ఘనంగా అంత్యక్రియలు నిర్వహిస్తారు. కానీ ఆ తరువాత 3, 5, 11 రోజుల్లో చేసే కర్మకాండలను మాత్రం నిర్వహించరు. గ్రామంలో ప్రతీఏటా ఫిబ్రవరి చివరిలో భీముని పండుగ చేసిన తరువాతనే, ఆ ఏడాది చని పోయిన వారందరికీ కర్మలు పూర్తి చేస్తారు. ఈ తంతును అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ప్రతీ కుటుంబీకులు ఈ కార్యక్రమాలకు తప్పకుండా హాజరు కావాలని గ్రామ పెద్దలు ఆదేశిస్తారు. మృతదేహాలు ఖననం చేసిన చోటుకు చేరుకుని వానిని స్మరించి, కర్మలు పూర్తి చేస్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కందిపాడు గ్రామం మంగళవారం ఇలాంటి ఉత్సవాలకు వేదికైంది. కందిపాడు గ్రామంలో సుమారు 250 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. పూర్తి వలస ఆదివాసీ గ్రామమైన కందిపాడులో ఈ ఏడాది వివిధ కారణాలతో ఆరుగురు చనిపోయారు. అయితే కొద్ది రోజుల క్రితమే గ్రామంలో భీముని పండుగ పూర్తి కావడంతో ఈ సంవత్సరం చనిపోయిన వారికి కర్మలు పూర్తి చేయాలని పెద్దలు నిర్ణయించి మంగళవారం ఉదయం ఆ ఆరుగురికి సామూహిక కర్మలు పూర్తి చేశారు. గ్రామశివారులోని అడవిలో ఉన్న స్మశాన వాటిక వద్దకు చేరుకుని చనిపోయిన వారికి ఇష్టమైన పదార్థాలు, కల్లు సమర్పించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రతిఒక్కరు చనిపోయినవారికి గుర్తుకు చేసుకొని కన్నీరు పెట్టారు. కార్యక్రమంలో సుమారు 500 మంది ఆదివాసీలు పాల్గొన్నారు. ఇది తమ గ్రామ సంప్రదాయమని ప్రతీ ఏడాది భీముని పండుగ చేసిన తరువాతనే కర్మలు చేస్తామని గ్రామ పెద్దలు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.




కందిపాడు అడవుల్లో సామూహిక కర్మలు చేస్తున్న ఆదివాసీలు, తమ వారిని తలుచుకొని విలపిస్తున్న ఆదివాసీ యువతులు

కంప్యూటర్ సైన్స్‌లో దంపతులకు డాక్టరేట్



ఆంధ్రప్రదేశ్ గవర్నర్ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న బలరాం, మమత

కొణిజర్ల, మార్చి 5: మండలంలోని ఎస్సీపురం (జమ్మికోయబంజర) గ్రామానికి చెందిన దంపతులు ఏ బలరామ్, మమతలకు కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఒకే సారి ఇద్దరు డాక్టరేట్ సాధించారు. దంపతులు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. బలరామ్ హైదరాబాద్ ఇబ్రహింపట్నం సమీపంలోని సైంట్ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాల జిలో కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీగా పని చేస్తున్నారు. అతను 'సాఫ్ట్‌వేర్ పాల్ట్ ప్రిడిక్షన్ యూసింగ్ ఫీచర్ ఎక్స్ట్రాక్షన్ విత్ అడాప్టివ్ సింథెటిక్ సాంప్లింగ్ అల్గారిథమ్' అనే అంశంపై వ్యాసాన్ని ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ వసుంధర పర్యవేక్షణలో సమర్పించగా యూనివర్శిటీవారు డాక్టరేట్ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారు. అతని సతీమణి మమ త హైదరాబాద్ శ్రీనిధి ఇన్సిట్యూట్ అఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీగా పని చేస్తున్నారు. మమత 'ఆటోమేటెడ్ కోడ్ రిపేర్ యూసింగ్ ఇంప్రూవ్డ్ గ్రాస్ హోపర్ ఆప్టిమైజేషన్ అల్గొరిథమ్ డెన్స్ నెట్ మోడల్ ఫర్ ఆబ్జెక్ట్ ఓరియేంటెడ్ ప్రొగ్రామ్స్ అనే అంశంపై పరిశోధన గ్రంధాన్ని జేఎన్‌టీయూ ప్రొఫెసర్‌లు డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ శోభా బిందుల పర్యవేక్షణలో సమర్పించారు. దాంతో ఆమెకు డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు.

దంపతులు ఇద్దరు ఏపీలోని అనంతపూర్ జేఎన్ టీయూ నుంచి డాక్టరేట్ సాధించి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్, జేఎన్‌టీయూ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ రంగాజ నార్ధన్ చేతులు మీదగా ఇటీవల డాక్టరేట్‌ను అందుకున్నారు. దంపతులకు ఇద్దరికి డాక్టరేట్ రావడం పట్ల స్వగ్రామంలో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నవజాత శిశువు మృతి

ఆళ్లపల్లి, మార్చి 5: ఆళ్లపల్లి పీహెచ్‌సీలో సోమవారం రాత్రి నవజాత శిశువు మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం మండల పరిధిలోని వెంకటాపూరం గ్రామానికి చెందిన ఆడెమ్మ అనే గర్భిణికి సోమవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో స్వగ్రామం నుండి 108 వాహనంలో పీహెచ్‌సీకి తీసుకవచ్చారు. ఆ రాత్రి ఆడెమ్మ మగబిడ్డకు పురుడుపోసుకోగా అదే సమయంలో శిశువు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

చంద్రుగొండ: రోడ్డు ప్రమాదంలో భార్య భర్తలు తీవ్రగాయాల పాలైన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. సుజాతనగర్ మండలానికి చెందిన తిరుమలరావు,రమణ దంపతులు ద్విచక్రవాహనంపై అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెం వెళ్లి తిరుగు ప్రయాణంలో చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనం ఢీ కొనడటంతో భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అశ్వారావుపేట రూరల్: ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఆంధ్రాలోని తాడేపల్లికి చెందిన ఎం.కొండలరావు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై సత్తుపల్లి వైపునకు వెళ్తుండగా, ఇదే మార్గంలో వెళ్తున్న ఆటో మండలంలోని శ్రీరంగాపురం సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద ఢీకొన్నాయి. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.

కలుషితమవుతున్న మిషన్ భగీరథ నీరు

సత్తుపల్లిరూరల్, మార్చి5: సత్తుపల్లి మండలానికి భద్రాద్రి జిల్లా మిషన్ భగీరథ తాగునీరు కలుషితమవు తుంది. మండలంలోని కాకర్లపల్లి శివా రులోని మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ వద్ద ఏళ్ల తరబడి లీకులు కావడంతో నీరు వృధాగా పోతుంది. దీంతో మడుగుగా మారి అవేనీరు మళ్లా పైపులైన్ల ద్వారా చేరుతున్నాయని, ప్రజలు వీటిని తీసుకోవ డంతో రోగాల బారీన పడుతున్నారనే ఆరోపణలు ఉన్నా యి. అదేవిధంగా ఇలాగే చాలాప్రాంతాల్లో మిషన్ భగీరథ తాగునీరు వృధాగా పోతుండటంతో పాటు మురుగుచేరి కలుషితం అవుతున్నాయని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి అందించాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి.



మురుగునీటిలో భగీరథ పైప్‌లైన్

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హాసన్‌పై బదిలీ వేటు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి5: టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు షేక్ అఫ్జల్‌హాసన్‌ను ములుగు జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ల్యాండ్ సర్వే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న అఫ్జల్‌హాసన్ టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఆయనపై కె శ్రీరామ్‌మోహన్‌రావు అనే వ్యక్తి రెవెన్యూ విజిలెన్స్ శాఖకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు శాఖాపరమైన విచారణను సులువుగా చేసేందుకు వీలుగా ఆయనను డిప్యూటేషన్‌పై ములుగు జిల్లాకు బదిలీ చేస్తూ సర్వేల్యాండ్ రికార్డ్సు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

'పూనం' వచ్చేసింది..



జాగిలాన్ని పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం క్రైం, మార్చి 5: శిక్షణ పూర్తి చేసుకుని కాకర్ స్పానియల్ జాతికి చెందిన పూనం అనే పోలీసు జాగిలం మంగళవారం ఖమ్మం నగరానికి చేరుకుంది. సంబంధిత అధికారులు మంగళవారం సీపీ కార్యాలయానికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నేర దర్యాప్తు సమయంలో పోలీసు జాగిలాల సేవలు ఎంతో కీలకమని, మోయినాబాదులోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రెయినింగ్ అకాడమిలో పేలుడు పదార్థాలను కనుగొనడంలో హ్యాండ్లర్ కానిస్టేబుల్ ఎస్‌కే పాషా ఈ పూనం జాగిలానికి 8 నెలలపాటు కఠోర శిక్షణ ఇచ్చినట్లు సీపీ తెలిపారు. మోయినాబాద్ శిక్షణ కేంద్రంలో 21 జాగిలాలకు 8నెలల పాటు 28మంది హ్యాండర్ల ప్రత్యేక శిక్షణ ఇచ్చారని, ఈ జాగిలాల్లో పలు జాతులకు చెందినవి ఉన్నట్లు తెలిపారు. సంక్లిష్టమైన కేసుల పరిశోధన, ఛేదనలో అత్యంత కీలక పాత్ర వహించేలా వృత్తిలో ప్రతిభ కనబరుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఏసీపీ నరసయ్య, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

ఖాళీ గ్యాస్ సిలిండర్ చోరీ

నేలకొండపల్లి, మార్చి5: ఇంటి ముందు ఉంచిన ఖాళీ గ్యాస్ సిలిండర్‌ను ద్విచక్రవాహనంపై వచ్చిన ఇరువురు వ్యక్తులు చోరీ చేసి తీసుకెళ్తుండగా, గ్రామంలోకి ద్విచక్రవాహనంపై వస్తున్న వారు అనుమానం వచ్చి పట్టుకుని, గ్రామంలోకి తీసుకొచ్చి నేలకొండపల్లి పోలీసులకు అప్పగించారు. మండల పరిధిలోని సుర్దేపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన నల్లెబోయిన పుల్లయ్య అనేవ్యక్తి ఇంట్లోని గ్యాస్ సిలిండర్ అయిపోతే, గ్యాస్ బండి గ్రామంలోకి వస్తే, ఖాళీది ఇచ్చి, నిండు బండ తీసుకోవటానికి ఇంటి బయట పెట్టి ఇంట్లో పని చేసుకుంటుండగా, ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు వచ్చి ఇంటి బయట పెట్టిన ఖాళీ గ్యాస్ బండని తీసుకెళ్తుండగా, అటుగా బైక్‌పై వస్తున్న వ్యక్తులు చూసి పట్టుకోవటానికి ప్రయత్నించగా వారు సిలిండర్‌ను వదిలి పారిపోయారు. పారిపోయిన వ్యక్తులను బోదులబండ గ్రామానికి చెందిన చల్లా నవీన్, అనంతు మధులుగా గుర్తించారు. పుల్లయ్య ఫిర్యాదు మేరకు నేలకొండపల్లి ఎస్ఐ తోట నాగరాజు చల్లా నవీన్, అనంతు మధులపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తోటకూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో

మూడు మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు

- 9న ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి

కారేపల్లి, మార్చి 5: తోటకూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గేటుకారేపల్లి గ్రామానికి చెందిన తోట కూరి పిచ్చయ్య, సత్యకుమారి దంపతుల ఆధ్వర్యంలో మూడు గ్రామాలలో ఉచిత మినరల్ ప్లాంట్ల ఏర్పాటుచేసి తాగునీరు అందించేందుకు శ్రీకారం చూట్టారు. మండల పరిధిలోని గేటుకారేపల్లి, రేగులగూడెం, కారేపల్లి వెంకటసాయి పెట్రోల్ బంకు సమీపంలో తోటకూరి ఫౌండేషన్ సౌజన్యంతో సురక్షిత తాగునీరు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. రూ.20లక్షలతో ఏర్పాటుచేసిన ప్లాంట్లను 9న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాసునాయక్ ప్రారంభించనున్నారు.

సురక్షిత తాగునీరు అందించాలనే: పిచ్చయ్య

మూడుగ్రామపంచాయతీలలో రూ.20లక్షల వ్యయంతో మినరల్ వాటర్‌ను ఉచితంగా అందజేసేందుకు ఏర్పాటుచేశాం. రానున్న రోజులలో మరిన్ని గ్రామపంచాయతీలలో ఈ ఉచిత మంచినీటి సౌకర్యాన్ని తోటకూరి ఫౌండేషన్ సహకారంతో అందజేస్తున్నట్లు పిచ్చయ్య, సత్యాకుమారి దంపతులు మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.



ప్రారంభించన్ను ప్లాంట్

సూరంపల్లిని పరామర్శించిన రేణుక

ఏన్కూరు, మార్చి 5: దుండగుల దాడిలో తీవ్రంగా గాయపడి హైదరాబాదు ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొణిజర్ల మాజీ సర్పంచ్ ఎల్‌డీఎం కో ఆర్డినేటర్ సూరంపల్లి రామారావును మంగళవారం రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దుంగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏన్కూరు మండల యూత్ కాంగ్రెస్ నాయకులు వక్కంతుల నాగార్జున పాల్గొన్నారు



రామారావు కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న రేణుక

కల్తీ డీజిల్ పోశారని పెట్రోల్‌బంక్‌లో వివాదం

కల్లూరు, మార్చి 5 కల్లూరులో గల ఓ పెట్రోల్ బంక్ లోని యాజమాన్యం బొలేరా అశోక్ లేలాండ్ మోటారు వాహనంలో కల్తీ డీజిల్ పోశారని ఆరోపిస్తూ మంగళవారం పలువురు వినియోగ దారులు వివాదానికి దిగారు. వివరాలిలా ఉన్నాయి. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన నేరేళ్ల నాగరాజు తన బొలేరా వాహనంలో సోమవారం రాత్రి ఖాన్‌ఖాన్ పేటలో గల ఓ పెట్రోల్‌బంక్‌లో సుమారు 40 లీటర్ల డీజిల్ కొట్టించాడు. సదరు వాహనం ఒక కీలో మీటరు దూరం వెళ్లగానే ఆ వాహనం ముందుకు కదల కుండా ఆగిపోందని నాగరాజు స్థానికంగా ఆర్డీవో, తహసీల్దార్, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇలా కల్తీ డీజిల్ పోయటంతో తన వాహనం ఇంజన్ పాడైందని స్థానికంగా మెకానిక్‌లు తెలిపారని వివరించాడు.

కల్తీ డీజిల్‌తో తన వాహనంకు జరిగిన నష్టంపై విచారణ నిర్వహించి పెట్రోల్‌బంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలిని నాగారాజు పై విధంగా వినతి పత్రం అందించాడు. ఈ మేరకు సివిల్ సప్లై డీటీ సత్యనారయణకు అందిన సమాచారంతో సదరు వాహనంలో పోసిన డీజిల్‌తో పాటుగా బంక్ ట్యాంకులో గల డీజిల్ నమూనాలను సేకరించి సాంకేతిక పరిక్షకు పంపటం జరగుతుందని ఆయన విలేకరులకు తెలిపారు.

ఖమ్మం నుంచే ఎన్నికల శంఖారావం

- రేపు లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమావేశం
- హాజరుకానున్న మాజీ మంత్రి హరీష్‌రావు
- అదేరోజు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు అభినందన సభ
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ వెల్లడి

ఖమ్మం కార్పొరేషన్, మార్చి 5: పార్లమెంట్ ఎన్నికల ప్రచార శంఖారావాన్ని ఖమ్మం నుంచే ప్రారంభించనున్నామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వెల్లడించారు. పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరావు గెలుపుపై దిశానిర్దేశనం చేసేందుకు గురువారం ఉదయం 10గంటలకు ఖమ్మంలోని వీవీసీ ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తామని, మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావుతోపాటు పార్లమెంటరీ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. అదేరోజు మధ్యాహ్నం బైపాస్ రోడ్‌లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అభినందన సభ, ఆయనకు రెండోసారి అవకాశం ఇచ్చిన మాజీ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత సభ నిర్వహిస్తామన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యనేతల సమావేశంలో మధుసూదన్ మాట్లాడుతూ వద్దిరాజు అభినందన, కేసీఆర్‌కు కృతజ్ఞత సభకు భారీగా జనసమీకరణ జరగాలన్నారు. అలాగే నామా గెలుపుకోసం కృషి చేయాలన్నారు. ఇప్పుడు అధికారం లేకపోయినా బీఆర్ఎస్ శ్రేణులు అధైర్యానికి గురికావొద్దని, వారికి జిల్లా పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. అధికారపార్టీ నేతలు మనని ఏంచేయలేరు. కాకుంటే కేసులు పెడతారు.. ఉద్యమాలు, కేసులు బీఆర్ఎస్‌కు కొత్తకాదని తాతా మధుసూదన్ పేర్కొన్నారు.



అనంతరం అభినందన, కృతజ్ఞత సభలకు జన సమీకరణపై ముఖ్యనేతలతో తాతా మధుసూదన్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ నేతలనుంచి, ఆయా నియోజకవర్గాలనుంచి ఎంతమందిని తరలిస్తారనే అంశంపై చర్చించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర, మేయర్ పునుకొల్లు నీరజ, జడ్పీచైర్మన్ కమల్‌రాజ్, వైస్‌చైర్మన్ ధనలక్ష్మి, నాయకులు శీలంశెట్టి వీరభద్రం,రఘునాథపాలెం మండల అధ్యక్షుడు వీరూనాయక్, నాయకులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్ మార్చి 5: తీర్థాల, స్నానాల లక్ష్మీపురం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తీర్థాల సంగమేశ్వర స్వామి దేవాలయం, స్నానాల లక్ష్మీపురం జాతర ఏర్పాట్లపై దేవాదాయ, రెవెన్యూ, విద్యుత్, నీటిపారుదల , పంచాయతీ, ఆర్టీసీ మత్స్యశాఖ, ఫైర్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 8 నుంచి జరిగే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. దర్శనం క్యూలైన్లు, లైటింగ్, పారిశుధ్య చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ శివారులో పార్కింగ్, మిషన్ భగిరథ ద్వారా సురక్షిత తాగునీరు అందించాలన్నారు. స్నాన ఘట్టాలు ఏర్పాటు చేయాలన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం, భక్తులకు ఇబ్బందులు కలగకుండా బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, ఎస్ఈ ట్రాన్స్‌కో సురేందర్, జడ్పీ సీఈవో వినోద్, మిషన్ భగిరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, మత్స్యశాఖ ఏడి ఆంజనేయ స్వామి, దేవాదాయ అసిస్టెంట్ కమీషనర్ సులోచన, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




హాజరైన అధికారులు

'ధరణి' పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

ముదిగొండ: ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ ఆదేశించారు. మంగళవారం ముదిగొండ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ధరణి దరఖాస్తులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాపాలన దరఖాస్తుల ఫిర్యాదుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. దీనిపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముదిగొండ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రశ్నాపత్రాలను పోలీసు ఎస్కార్ట్‌తో తీసుకువస్తున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులు బయటకు వెళ్లిపోవడాన్ని గమనించి ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. ఓఎఎస్ విద్యార్థులకు షార్ట్‌హ్యాండ్ పిల్లింగ్ ట్రాన్స్‌పార్మేషన్ పేపర్‌కు గంట సమయమే ఇస్తారని సమాధానమిచ్చారు. ప్రశ్నాపత్రాలను భద్రం చేసే అల్మారాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ గౌతమ్



అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

జిల్లా ఉన్నతాధికారులతో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి5: అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ కోరారు. మంగళవారం తన ఛాంబర్‌లో జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవో, వివిధ హోదాల్లో ఉన్న ఉద్యోగులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా పరిషత్‌కు వచ్చిన నిధులు, వాటితో చేస్తున్న పనులపై సమీక్షించారు. ఆ తర్వాత దస్త్రాల నిర్వహణ, ఎప్పటికప్పుడు ప్రభుత్వంతో ఉన్నతాధికారులతో నిర్వహించే దస్త్రాలను సమస్యలను పరిష్కరించాలన్నారు. జవాబుదారీ తనంగా పనిచేసి మంచిపేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమీక్షలో జడ్పీ నిధులు, వాటి వినియోగం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు అందిస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నేలకొండపల్లిలో అభివృద్ధి పనులు ప్రారంభం

ఖమ్మంరూరల్, మార్చి5: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తెల్దారుపల్లిలో రూ.20లక్షలతో నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని (పల్లెదవఖాన) మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈనెల 11న భద్రాచలంలో శ్రీ సీతారాముల వారి సన్నిధిలో 5వ గ్యారంటీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వబోతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం విద్యా, వైద్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. వైద్యులు అందుబాటులో ఉండి పేద వారికి మంచి వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. ఇచ్చిన ప్రతీ హామీని తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమా, ఎంపీటీసీ సభ్యురాలు తమ్మినేని మంగతాయి, ఎంవీపాలెం పీహెచ్‌సీ డాక్టర్ శ్రీదేవి, రాష్ట్ర మహిళా కార్పోరేషన్ మాజీ చైర్మన్ మద్దినేని స్వర్ణకుమారి, జిల్లా నాయకులు రాయల నాగేశ్వరరావు, మండల నాయకులు వెంకటరెడ్డి, తమ్మినేని నవీన్ పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

నేలకొండపల్లి: రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం నేలకొండపల్లి మండలంలో పర్యటించారు. బౌద్ధస్తూపాన్ని సందర్శించారు. అందంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాని ఆదేశించారు. అనంతరం ముజ్జుగూడెంలో పశువైద్యశాలకు, నేలకొండపల్లిలో గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. తిరుమలాపురంతండాలో గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. తిరుమలాపురంతండాలోనే గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం నేలకొండపల్లిలో రూ.12కోట్లతో నిర్మించిన మోడల్ డిగ్రీ కళాశాల అదనపు తరగతి గదులు, బాలురు, బాలికల వసతి గృహాలను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్, పర్యాటక అధికారి నర్సింగ్‌నాయక్,



ముజ్జుగూడెంలో పశువైద్యశాలకు శంకుస్థాపన చేస్తున్న గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడి

టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, ఎస్ఈ శ్యామ్, తహసీల్దార్ గౌరీశంకర్, ఎంపీడీఓ ఎర్రయ్య నాయకులు రాయల నాగేశ్వరరావు, ఎంపీపీ వజ్జా రమ్య, వేగినాటి లక్షీనర్సయ్య, నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొమ్మూరి ప్రసాద్, జూకూరి గోపాలరావు, బండి జగదీష్, జొన్నలగడ్డ రవి, గోళ్ళ శ్రీనివాసరావు, బచ్చలకూరి నాగరాజు, షేక్ ఖాజామియా తదితరులు పాల్గొన్నారు. ఎన్టీయార్ విగ్రహానికి స్థలాన్ని ఇప్పించాల్సిందిగా తెలుగుదేశం నాయకులు, పార్ట్‌టైం స్వీపర్లు తమ సమస్యలను పరిష్కరించాల్సిందిగా వినతి పత్రం అందించారు. మజీద్ కమిటీ సభ్యులు మంత్రి శ్రీనివాసరెడ్డిని మజీద్‌లో శాలువాలతో సన్మానించారు.

రంగారావును పరామర్శించిన రాష్ట్ర మంత్రి

ఖమ్మంసంక్షేమవిభాగం: ప్రమాదవశాత్తు గాయపడిన కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. మంగళవారం రంగారావు నివాసానికి ఆయన వెళ్లారు.

ఆర్ఎంపీలకు వృత్తిపర భద్రత కల్పిస్తాం

- మంత్రులు తుమ్మల, పొంగులేటి
- ఆర్టీసీ లహరి బస్సులను ప్రారంభించిన తుమ్మల



మాట్లాడుతున్నమంత్రి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంకలెక్టరేట్, మార్చి5: రాష్ట్రంలో ఆర్ఎంపీ వైద్యులకు వృత్తిపరమైన భద్రత కల్పిస్తామని వ్యవసాయ, చేనేత, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో మంగళవారం ఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా సమావేశానికి మంత్రి తుమ్మల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పలువురు ఆర్ఎంపీలు మాట్లాడుతూ తమపై కొందరు నిరంతరం దాడులు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కేసులు పెడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి తుమ్మల ఆర్ఎంపీల సమస్యలపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో ఫోన్‌లో మాట్లాడారు. ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి, వృత్తిపరమైన భద్రతకు వైద్యఆరోగ్యశాఖ సానుకూలంగా ఉందని చెప్పడంతో ఆ విషయాన్ని ప్రస్తావించి హామీ ఇచ్చారు. అలాగే గ్రామాల్లో పనిచేసే ఆర్ఎంపీలకు గుర్తింపు కార్డులు, ప్రభుత్వపరంగా అర్హత ఉన్న పథకాలను కూడా అందిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. వారు సమాజంలో గౌరవంగా జీవించేందుకు చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఖమ్మంలో ఆర్టీసీ లహరి బస్సులు ప్రారంభించిన మంత్రి తుమ్మల

టీఎస్ ఆర్టీసీకి చెందిన నూతన లహరి బస్సులను వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రారంభించారు. బస్సుల నిర్వహణ, సమయపాలనలో ఆర్టీసీ అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రైవేటు బస్సులకు పోటీగా తెలంగాణ ఆర్టీసీ ప్రయాణీకులకు అధునాతన సౌకర్యాలతో బస్సులు ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునిల్‌దత్, ఆర్టీసీ ఆర్ఎం వెంకన్నబాబుతోపాటు పలువురు అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతి సేవా నిలయం భవవనం ప్రారంభం

సత్తుపల్లి: సంకల్పం ఉంటే ప్రజాసేవ కోసం చేపట్టే ఏ పని అయినా సజావుగా పూర్తి అవుతుందని భగవాన్ సత్యసాయి బాబా బోధించే వారని వ్యవసాయ, సహకార, చేనేత శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం సత్తుపల్లిలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ప్రశాంతి సేవా నిలయం భవనాన్ని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే.రత్నాకర్‌తో కలిసి ప్రారంభించారు. దేశంలో 25రాష్ట్రాలు, ప్రపంచ వ్యాప్తంగా 140దేశాలలో సత్యసాయి సేవా కార్యక్రమాలు కొనసాగుతు న్నాయని అన్నారు. అంతకముందు హోమియో, ఆప్తమాలజీ, అయుర్వేదం, వైద్య సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పీ.వెంకటరావు, జాతీయ సర్వీస్ కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, సత్తుపల్లి కన్వీనర్ గాదె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

మధిరరూరల్, మార్చి5: మధిర మండలం సిరిపురం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. బోనకల్ మండలం కలకోట గ్రామానికి చెందిన బొగ్గారం ధర్మారావు మధిర మధిర నుంచి ఆటో వేసుకొని కలకోట వెళ్తున్నాడు. మార్గమధ్యలో సిరిపురం వద్ద ఇతని ఆటో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఆటోలో నుంచి కింద పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు ఇవ్వాలి

తిరుమలాయపాలెం, మార్చి5: అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

తిరుమలాయపాలెం, మార్చి5: తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మంగీలాల్, ఎంపీడీవో శేషాద్రి హెల్ప్‌డెస్కును ఏర్పాటు చేశారు. ఇటీవల ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారంటీలను ప్రవేశపెట్టింది. ప్రజలు వివిధ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాగా వాటిలో కొన్ని తప్పులుండడంతో లబ్దిదారులకు సంక్షేమ పథకాలకు అనర్హులుగా గుర్తిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రతీఒక్కరు కూడా సంక్షేమపథకాలు అందించే కార్యక్రమంలో భాగంగా హెల్ప్‌డెస్కును ఏర్పాటు చేశారు.

దంసలాపురంలో అగ్ని ప్రమాదం

ఖమ్మంక్రైం,మార్చి5: ఖమ్మం పట్టణ శివారులోని ద్వంసలాపురం సమీపంలో మంగళవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. బోనకల్ ప్రధాన రహదారి పక్కనఎస్ఆర్‌హోమ్స్ దగ్గరలో గుర్తుతెలియని వారు అక్కడున్న చెత్తకు నిప్పు పెట్టారు. దీంతో ప్రమాదవశాత్తు అక్కడున్న చెత్తకు నిప్పంటుకొని మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించటంతో ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పివేశారు.

సత్యసాయి గోశాల ప్రారంభం



గోశాలను ప్రారంభిస్తున్న ట్రస్టు సభ్యులు

వైరా, మార్చి 5: వైరా శాస్త్రీనగర్‌లోని సత్యసాయి గోశాలను పుట్టపర్తి సత్యసాయి సేవ ట్రస్టు చైర్మన్ ఆర్‌జే.రత్నాకర్ మంగళవారం ప్రారంభించారు. సత్యసాయి వేదపాఠశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోశాలను ప్రారంభించి గోవులకు పూజలు చేశారు. సత్యసాయి భక్తులు ఎన్నారై గోకుల వేదమూర్తి, కస్తూరి దంపతులు గోశాలకు రూ.10లక్షల విరాళం ఇచ్చి నిర్మించారు. ట్రస్టు సభ్యులు కోటేశ్వరరావు, వెంకట్రావ్, వేదమూర్తి, సాంబమూర్తి, వంగవీటి భాస్కర్‌రారావు, కుతుంబాక సుభాష్, డాక్టర్ కాపా మురళీకృష్ణ, సుధాకర్‌రావు, అచ్యుత్, శేషసత్యకుమార్, అద్దంకి వెంకటయ్య, ఉపేంద్రరావు పాల్గొన్నారు.

డయల్100కు 3726కాల్స్

ఖమ్మంక్రైం,మార్చి5: డయల్ 100కు ఫిబ్రవరిలో 3726 కాల్స్ వచ్చాయని, వాటిపై విచారణ జరిపి 82 కేసులు నమోదు చేసినట్టు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో హత్యాయత్నం1, మహిళలపై వేధింపులు6, దొంగతనాలు 10, యాక్సిడెంట్లు18, సాధారణ ఘాతాలు22, అనుమానస్పద మరణాలు3, ఇతర కేసులు 22 అని సీపీ తెలిపారు.

రేపటినుంచి మధిరలో మహాశివరాత్రి ఉత్సవాలు

- ఉత్సవాల్లో పాల్గొననున్న డీప్యూటీ సీఎం దంపతులు





మృత్యుంజయస్వామి ఆలయం, మూలవిరాట్ శ్రీమృత్యుంజయస్వామి

మధిర, మార్చి 5: మధిరలోని శ్రీమృత్యుంజయస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి 11వ తేదీ సోమవారం వరకు ఐదు రోజుల పాటు జరగనున్నాయి. ఈసారి ఆలయ కమిటీని ప్రభుత్వం నియమించకపోవడంతో అధికారులే ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు. కాశీ తర్వాత నేరుగా శివలింగాన్ని తాకి భక్తులే పూజలు చేయటం ఇక్కడి విశేషం. ఈ శైవ క్షేత్రం మహాశివరాత్రి ఉత్సవాలు ప్రతి సంవత్సరం ఐదు రోజులపాటు ఘనంగా జరుగుతాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల భక్తులు భారీగా హాజరవుతారు. ఆలయానికి ఉత్తరం వైపు స్మశానం, పడమర జీవనదిలా ప్రవహించే వైరానది ఈ ఆలయం ప్రత్యేకత గత పాలకమండలి ఆధ్వర్యంలో కోటిన్నర రూపాయల నిధులతో భక్తులు సహకారంతో ఆలయ పునఃనిర్మాణం చేసి అభివృద్ధి చేశారు. ఈసందర్భంగా రెండు రాష్ట్రాల స్థాయిలో ఎద్దుల బరువు లాగు పందాలు, పొట్టేలు పోటీలు, జరుగుతాయి. ఈ ఉత్సవాలను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు సందర్శించనున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు తగినట్లుగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె జగన్‌మోహన్‌రావు, ఆలయ ప్రధాన అర్చకుడు రాయప్రోలు వెంకట సత్యనారాయణ శర్మ తెలిపారు. 7న స్వామి వారిని, అమ్మవార్లను పెండ్లికుమారుడుగా, పెండ్లికుమార్తెల కార్యక్రమాలుతో ప్రారంభమవుతాయి. 8న రాత్రి స్వామి వారి కళ్యాణమహోత్సవం, 9న రథోత్సవం, 11న పూర్ణాహుతి పూజా కార్యక్రమాలతో పాటు నిత్య పూజలు జరుగుతాయి. 11న రాత్రి మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు ఈవో తెలిపారు. ఆర్టీసీ పలుప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు డీఎం తెలిపారు.

శివరాత్రి ప్రత్యేకతపై ప్రచారం

ఖమ్మంసాంస్కృతికం: శివరాత్రి పర్వదిన ప్రత్యేకతను వివరిస్తూ ఇందుజ్ఞాన వేదిక ఖమ్మం కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం టేకులపల్లిలో ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, తదితర అనుబంధ గ్రంథాలను పంపిణీ చేశారు. వేదిక సభ్యులు నాగరాజు, విజయమ్మ, లక్ష్మణ్, జయశ్రీ, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

100రోజుల్లోనే ఆరు గ్యారెంటీల అమలు



జీరోబిల్లును అందిస్తున్న కార్పొరేటర్ సైదులునాయక్

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి5: కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసి తీరుతామని 8వ డివిజన్ కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్ తెలిపారు. మంగళవారం గోపాలపురంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు ఉచిత కరెంట్ బిల్లు జీరో బిల్లులను అందించారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారిత కోసం ఉచిత బస్ సౌకర్యం కల్పించిందన్నారు. చేతి వృత్తులు, ఉపాధి, ఉద్యోగ మహిళలకు ఉపయోగంగా మారిందన్నారు. విద్యుత్‌శాఖ ఏడీఈ రమేశ్, ఏఈ అశోక్, నాయకులు పరిమిల నాగేశ్వరరావు, బోడా ప్రవీణ్‌కుమార్, నారపోగు అబ్రహాం, శ్రీధర్ పాల్గొన్నారు.

మెడికల్ బిల్లులు మంజూరు చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి5: ఉద్యోగుల, ఉపాధ్యాయులు, పెన్షనర్ల మెడికల్ బిల్లులు తీవ్ర జాప్యంతో మంజూరు అవుతున్నాయని జాప్యాని నివారించి దరఖాస్తు చేసుకున్న వెంటనే బిల్లులుమంజూరు చేయాలని కోరుతూ యుటీఎఫ్ జిల్లా కమిటి మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటిండెంట్ కిరణ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. జిల్లా పరిషత్ జీపీఎఫ్ వాభాగంలో నెలకొన్న సమస్యలపై జీపీఎఫ్ సూపరింటిండెంట్ శ్రీదేవిని కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, బుర్రి వెంకన్న, షమీ, తదితరులు పాల్గోన్నారు.

ఇగ్నో కోర్సులతో లబ్ధి

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 5: ఇగ్నో కోర్సులు చేయటం ద్వారా లబ్ధి పొందవచ్చునని హైద్రాబాద్ ఇగ్నో రీజనల్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్ అన్నారు. మంగళవారం ఆయన ఖమ్మం నగరంలోని బీసీ గురుకుల డిగ్రీ కళాశాల, మ్యాక్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గోని విద్యార్థులకు ఇగ్నో ఆఫర్ చేస్తున్న సర్టిఫికెట్స్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ తదితర కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇగ్నో స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ రమణారావు, ఇంచార్జ్ ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గోన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు 'హాఫ్‌డే' అమలు చేయండి

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి5: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఆఫ్‌డే స్కూల్స్‌ను అమలు చేయాలని బీఆర్టీయూ నాయకులు మంగళవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవధ్యక్షుడు మాలూరి లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు పారిజాతం, లక్ష్మీ, పద్మా పాల్గొన్నారు.

బెల్టుషాపులను రద్దుచేయాలి

ఏన్కూరు,మార్చి5: గ్రామాల్లో వెంటనే బెల్టు షాపులను రద్దుచేసి ప్రభుత్వ హామీని నెరవేర్చాలని సీపీఐ మండల కార్యదర్శి జాగర్లముడి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏన్కూరులో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఈసమావేశంలో జిల్లా సమితి సభ్యులు తెప్పల సత్యం, అమరనేని వీరభద్రం, మేడ భూషయ్య, మాదినేని వెంకన్న పాల్గొన్నారు.

లైన్‌మెన్‌లు మంచి సేవలందిస్తున్నారు

కామేపల్లి,మార్చి5: విద్యుత్ వినియోగదారులకు లైన్‌మెన్ ఉత్తమ సేవలను అందిస్తున్నారని విద్యుత్ శాఖ లింగాల ఏడీఈ ఆనందర్ కుమార్, ఏఈ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జాతీయ లైన్‌మెన్ దినోత్సవం పురస్కరించుకొని లైన్‌మెన్లను సన్మానించారు. ఈకార్యక్రమంలో కరుణాకర్, శంకర్, శ్రీను, నరేష్, కుమార్, రమేష్, అనంతబాబు, నాగేశ్వరరావు, రాంచందర్, భద్రు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు

మధిర, మార్చి5: యూటీఎఫ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మధిర డివిజన్‌స్థాయిలో మహిళా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. బహుమతుల ప్రదానోత్సవానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, డాక్టర్ షహనాజ్ హాజరయ్యారు. ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని, వయస్సు రీత్యా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు కస్తూరి బాయి, జిల్లా కార్యదర్శి నాగూర్‌వలీ, ఏ వినోదరావు, బి నాగరాజు, ఇబ్రహీం, ఈ వీరయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత పెంచుకోవాలి

ఖమ్మంరూరల్, మార్చి5: విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలని డీసీబీ బ్యాంకు మేనేజర్ దినేష్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో బ్యాంకు లావాదేవీలపై మంగళవారం అవగాహన కల్పించారు.

దాహార్తిని పరిష్కరించాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి5: ఖమ్మంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందిపడుతున్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని సీపీఐ జిల్లా నాయకులు మహ్మద్ సలామ్ డిమాండ్ చేశారు. మంగళవారం మూడో పట్టణ సమావేశంలో మాట్లాడారు. మున్నేరు వాటర్ ఫిల్టర్‌ను పరిశీలించారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రులు పొంగులేటి, తుమ్మల

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి5: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. మంగళవారం వీరిని వివిధ జర్నలిస్టు నాయకులు వేర్వేరుగా కలిసి సమస్యలను వివరించారు. హెల్త్ కార్డులు, ఇళ్లస్థలాల సమస్య కూడా పరిష్కరించాలని విన్నవించారు. సమస్యను త్వరలోనే ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. 11న ముఖ్యమంత్రి భద్రాచలం పర్యటనకు జిల్లా జర్నలిస్టులు హాజరుకావాలని వారు చెప్పారు. టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాం నారాయణను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరామర్శించారు. ఇటీవల గుండెకు సంబంధించి శస్త్రచికిత్స చేయించుకున్న రాంనారాయణ ఇంటికివెళ్లి పరామర్శించారు. మంత్రి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. పొంగులేటి వెంట మాజీఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, బొర్ర రాజశేఖర్, స్వర్ణకుమారి, జర్నలిస్టుల సంఘాల యూనియన్ నాయకులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వర్లు, ఆకుతోట ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ కూడా రాంనారాయణను పరామర్శించారు.

మునిసిపల్ సిబ్బంది సమయం పాటించాలి



కమిషనర్‌తో ఫిర్యాదు చేస్తున్న 8వ వార్డు ప్రజలు

వైరా, మార్చి5: మునిసిపాలిటీలోని అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని కమిషనర్ సీహెచ్.వేణు ఆదేశించారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులు, సిబ్బందితో కమిషనర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమయపాలన పాటించకుండా కార్యాలయంలో విధులకు హాజరయ్యే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం పది గంటలకు విధిగా విధులకు హాజరు కావాలని స్పష్టం చేశారు. కాగా వైరా మునిసిపాలిటీలోని మెప్మా ఆర్‌పీలకు పెండింగ్‌లో ఉన్న ఏడునెలల వేతనాల చెక్కును కమిషనర్ వేణు అందజేశారు. ఆర్‌పీలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మెప్మాలోని కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. మెప్మా టీఎంసీ బండారుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

వైరా మునిసిపాలిటీ 8వ వార్డు బోడేపూడి కాలనీలో ఇళ్ల మధ్య సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ మునిసిపల్ కమిషనర్ వేణుకు ఆకాలనీ స్థానికులు వినతిపత్రం సమర్పించారు. తమ నివాసాలకు దూరంగా సెల్‌టవర్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

రక్తదానంతో తలసీమియా చిన్నారులను ఆదుకోండి

ఖమ్మం కలెక్టరేట్, మార్చి5: తలసీమియా చిన్నారులకు రక్తదానం చేసి వారిని కాపాడాలని ఏఆర్ ఏసీపీలు ఎన్.నర్సయ్య, సుశీల్‌సింగ్ అన్నారు. మంగళవారం నగరంలోని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద బాధిత చిన్నారులకు మందులు పంపిణీ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో వందల మంది చిన్నారులకు రక్తం సేకరించి అందించడం ప్రశంసనీ యమన్నారు. వేసవిలో రక్తదాతలు ముందుకొస్తేనే చిన్నారుల జీవిత కాలం పెరుగుతుందని అన్నారు. మాజీ కార్పోరేటర్ చావా నారాయణరావు మాట్లాడుతూ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసేందుకు ముందుం టామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని చిన్నారుల కోసం త్వరలోనే రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డి.నారాయణమూర్తి, సునీత, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, పి.ఉదయ్ భాస్కర్, పి.రవిచందర్, అనిత పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న దృశ్యం

ధరణిపై సమగ్ర విధానం రూపొందించాలి

రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

కొణిజర్ల,మార్చి5: ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సింగరాయపాలెంలో రైతుసంఘం ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై సర్వే చేశారు.రాష్ట్రప్రభుత్వం ధరణి సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించాలని అందుకు రైతుసంఘాల ప్రతినిధులు, రైతులతో సమావేశం నిర్వహించి సూచనలను తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో ధరణి వలన రైతులు ఇబ్బందులు పడ్డారని, తరతరాలుగా సాగులో ఉన్న రైతులకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతనిప్పు చలపతిరావు, దొడ్డపునేని కృష్ణార్జునరావు, మిద్దె రామారావు, రామయ్య, అనుమోలు వెంకటేశ్వరరావు, ఖాసీంబేగ్, షేక్ అఫ్జల్ పాల్గొన్నారు.

ఇండియా కూటమిని బలోపేతం చేయాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి5: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమిని బలోపేతం చేసి బీజేపీని ఓడించాలని ఆమ్‌ఆద్మీపార్టీ తెలంగాణ కోర్ కమిటీ సభ్యుడు నల్లమోతు తిరుమలరావు కోరారు. మంగళవారం ఖమ్మం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెడుతూ పరిపాలన అధోగతి పాలు చేస్తున్నారన్నారు. ప్రతి పక్ష నాయకులపై ఈడీ, సీబీఐలను ఉసిగొల్పి ప్రదాని మోదీ బెదిరింపులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఇండియా కూటమి సమన్వయ కమిటీ కొరకు కాంగ్రెస్ చొరవ చూపాలని కోరారు. జిల్లాలో ఆప్ పార్టీ బలోపేతం కొరకు సభ్యత్వం విస్తృతంగా చేపట్టాలన్నారు. ఈసమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్, సిద్దెల రాంబాబు, చల్లా కల్పన తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సరుకుల పంపిణీ

వైరా, మార్చి5: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలను నిర్వహించారు. లయన్స్‌క్లబ్ గవర్నర్ నంబూరి మధు జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం వైరాలో పలు వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. బీటెక్ విద్యార్థిని బాణాల ఉమకు ల్యాప్‌టాప్‌ను, గజ్జల సావిత్రికి కుట్టుమిషన్‌ను అలాగే క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మోదుగు సుధాకర్‌కు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. చిరువ్యాపారులకు గొడుగులు అందజేశారు. నంబూరి మధు జన్మదిన వేడుకల కేక్‌ను కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే మానసిక వికలాంగుడికి రూ.25వేల ఆర్థికసహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, పెనుగొండ ఉపేంద్రరావు, లగడపాటి ప్రభాకర్, ఉంద్రు శ్యాంబాబు, సీహెచ్‌వీ.శివప్రసాద్, గజ్జల కృష్ణమూర్తి, నూకల వాసు, మిట్టపల్లి సత్యంబాబు(నాగి), మరికంటి గోపి పాల్గొన్నారు.

చేతిపంపు ఏర్పాటుకు సీడీఏ చేయూత

కల్లూరు, మార్చి 5: మండల పరిధిలోని చంద్రుపట్లలోని బీసీ కాలనీలో రూ.70 వేల అంచనాతో ఏర్పాటు చేసిన మరో చేతిపంపును మంగళవారం వెల్‌ఫర్ లైఫ్ అధ్యక్షుడు షైఖేల్ షైజర్, సెంటర్ ఫర్ డెవలమ్మెంట్ కార్యదర్శి పి ఏనోష్ కుమార్ ప్రారంభించారు. బీసీ కాలనీలో తాగునీటి ఎద్దడి ఉందని కాలనీ వాసులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దృష్టికి తీసుకోరావటంతో స్పందించారు. ఆయన సదరు సంస్థ వారికి చేసిన విజ్ఞాపన మేరకు వారు ఎట్టకేలకు ముందుకు వచ్చి ప్రజల దహార్తిని తీర్చేందుకు ఈ పంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీసీ కాలనీ వాసులు ఆ సంస్థ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచు గొల్లమందల ప్రసాద్, నాయకులు గొసు రమణ, వల్లపునేని రవి, పైళ్లా విశ్వనాధం తదితరులు పాల్గొన్నారు.